


ఎక్కడో ఎవరో ఒక ముసలమ్మ చచ్చింది. యశోదకు ముప్పైవేల రూపాయల విలువచేసే ఆస్తి సంక్రమించింది. ఊళ్ళో పెళ్ళయితే కుక్కలకు హడావుడి. ఎవరికన్నా లప్ప వచ్చి పడితే ఊళ్ళోవాళ్ళకి హడావుడి. కుక్కలకేదైనా ఒరుగుతుంది, మనుషులకేమీ ఒరగదు. ఎదురుగుండా వచ్చి "ఏం అదృష్టం! పెట్టి పుట్టాలి! దేవుడెవరికివ్వాలో వాళ్ళకే యిస్తాడు" అంటారు. అవతలికి వెళ్ళి "కలిసింది ముదనష్టం!" అంటారు. ఇట్లావచ్చి కలిసే ఆస్తులకి "ముదనష్టం" అనే పేరు. అంతమాత్రంచేత "ముదనష్టం" వచ్చి కలిస్తే వద్దనేవాడెవడూ లేడు. ఎవరికన్నా ముదనష్టం కలిసినప్పుడల్లా, నలుగురూ చేరి "ముదనష్టాలు" కలిసిన వారందరి కథలూ చెప్పుకుంటారు. అక్కడికది తృప్తి.

యశోదకి తండ్రి వున్నాడుగాని తల్లి లేదు. ఈ ఆస్తి కలవకపోయినా ఆమెకు అన్నవస్త్రాలకు లోటుల్లేదు. ఉన్న లోటేదో అది ఒకరు తీర్చేది కాదు.

ఆమె అన్నలిద్దరూ దూరదేశాల్లో ఉద్యోగాలు చేసి డబ్బు వెనకేసుకుంటున్నారు. తనకీ ఆస్తి వచ్చిందనగానే మొదట్లో ఆమెకు ఏ వికారము కలుగలేదు. పరిమిత మైన ఆమె అవసరాలు ఇక పెంచుకునేదిలేదు. అందుచేత ఈ ఆస్తి వచ్చి తన జీవితాన్ని ఏ విధంగా మార్పుచేసేది ఆమె ఊహించలేదు. డబ్బు చాలా పాపిష్టిదని, డబ్బు జాస్తిగా ఉన్నవాళ్ళకి ఈ లోకంలోగాని, పరలోకంలోగాని సుఖం లేదనీ ఆమె కొక అనుమానం కూడానూ


ఆస్తి కలిసినందుకు అందరూ తనను అభినందించి సంతోషం వెళ్ళబుచ్చు తూంటే, ఆస్తి వచ్చింది తనకు కాదని, ఊళ్లో వాళ్ళకని కూడా ఆమెకు తోచింది

అయితే సంఘంలో తన ప్రాముఖ్యం హెచ్చిందని యశోద త్వరలోనే తెలుసుకున్నది. ఇది తెలుసుకోవటానికి ఆమె మేనమామ లక్ష్మీకాంతం కూడా సహాయపడ్డాడు.

"ఏమేవ్ కోడలా! ఇతరులను హీనంగా చూడటానికీ, ఇతరులు చెయ్య టానికి భయపడే పనులు ధైర్యంగా చేయటానికీ నీకిప్పుడు కొంత అధికారం వచ్చిందన్నమాట! తెలుసా?" అన్నాడు కాంతం మామయ్య.

"నీ ఆస్తంతా అట్లాగే పాడుచేశావు కనుక నీ కా సంగతి బాగా తెలియాలి" అన్నది యశోద

"అందు కభ్యంతర మేమిటి? డబ్బు గురించి నన్నడుగు చెపుతాను. డబ్బు విలువ దాని ఉపయోగంలో ఉంది. మాట వరసకి నీ దగ్గిర వెయ్యిరూపాయ లున్నాయనుకో అది పెట్టి అవసరాలే గడుపుకుంటే దానికి విలువే లేదు. వెయ్యి రూపాయిలుంటే వెయ్యిమందికి రెండు పూటలా ఒకరోజు తిండికి సరి పోతుంది. ప్రపంచంలో రోజూ ఎన్నో కోట్లమంది రెండు పూటలా అన్నం తినేస్తున్నారు. అందువల్ల విశేషం ఏమీ జరగటంలేదు. ఆ వెయ్యి రూపాయిల్ని నువ్వు దుర్వినియోగపరచటానికి సిద్ధపడితేనే దాని విలువ నీకు గిట్టుబాటవు తుంది. తలా పదీ చేబదుళ్ళిచ్చావనుకో, వందమందిని కట్టేసుకుంటావు. త్రాగుడూ, వ్యభిచారాలూ, మోసాలూ, హత్యలూ మామూలు పనులు చేస్తే తప్పులు. వాటికి దండన. అదే డబ్బుగలవాళ్ళు చేస్తే వాటి విలువ వేరు. పిండి కొద్దీ రొట్టె. నీ దగ్గిర డబ్బున్నకొద్దీ ఈ పనులుచేసే అధికారం నీకు జాస్తిగా ఉంటూ ఉంటుంది. అందరికీ ఒకటే న్యాయచట్టమనేదీ, ఒకటే నీతి అనేదీ శుద్ధాబద్ధం. నన్ను చట్టాలు తయ్యారుచెయ్యమంటే ఆదాయాలువారిగా నీతి,




న్యాయమూ ఏర్పాటుచేస్తాను. జరుగుతున్నది అదేగా? చట్టంచేస్తే వచ్చిందా ఏమిటి?" అని కాంతం మామయ్యకు ఉపన్యాసం దంచాడు.

యశోదకి మేనమామతో ఆడే మాట్లాడటం ఇష్టంలేదు. ఆయన అన్ని వ్యసనాలకు దాసుడు పైగా అర్థంలేని సిద్ధాంతాలన్నీ చెబుతాడు వినటానికి తలనొప్పి. కాని మాట సాగిస్తే ఒకంతట వదలడు

''ప్రపంచమంతా నువ్వన్నట్టే వుంటుందా ఏమిటి ''' అన్నదామె.

"ప్రపంచం నువ్వు చూశావా? నేను చూశానా? నన్ను చూడరాదూ రెండేళ్ళ నుంచీ నే నింట్లోతప్ప పడుకోవటంలేదే! డబ్బుండగా ఎప్పుడన్నా ఇంటో పడుకుని ఎరుగుదునా?" అన్నాడు లక్ష్మీకాంతం.

యశోద "సరేలే!" అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది. తన సంభాషణ ఇతరుల కెట్లా తగిలేదీ తెలుసుకోగల ఆత్మజ్ఞాని కాడు కాంతం. యశోద వెళ్ళిపోయినందుకు అతను ఆశ్చర్యపోయాడు. నేరుగా తన బావగారి దగ్గరకి వెళ్ళి "ఏం బావా? యశోదకు వచ్చిన ఆస్తి విషయం వాళ్ళెవరో వ్యాజ్యం వేస్తారని విన్నాను నిజమేనా?" అన్నాడు.

"ప్లీడరుగారి నడిగితే వాళ్ళకు వ్యాజ్యం వెయ్యటానికి గడ్డిపరక ఆస్కారం కూడా లేదన్నాడు. అదేమీ లేదుగాని, పాపం, దానికి కాస్త మంచిరోజులు తిరిగినట్లుగా ఉంది. లేచిపోయిన ఆ వెధవ కూడా తిరిగొస్తే బాగుండును. ఆడదానికి మొగుడులేని బ్రతుకేం బ్రతుకురా, కాంతం?'' అన్నాడు ముసలాయన విచారంగా.

## 2

''అదెంత భాగ్యం బావా? పాపాల భైరవుణ్ణి నే ఉన్నాగా? వెతికిరమ్మంటే ఇవాళ వెళ్ళనూ? ఈ సారి వట్టిచేతులతో ఇంటికి వస్తానా? సప్త సముద్రాలూ గాలించి ఎక్కడున్నాసరే పిలకపట్టుకు లాక్కొస్తాగా? అన్నాడు కాంతం.

"నీ మొహం కాదూ? క్రిందటిసారి ఇట్లాగే నాలుగు వందలు పట్టుకెళ్లి ఏ గుర్రాల మొహానో పెట్టి వచ్చావ్!" అన్నాడు యశోద తండ్రి చలమయ్య.

"నీ తోడు బావా—!"

''నీ ప్రమాణా లెవరు నమ్మతార్రా? నీ సంగతి ఇవాళ చూస్తున్నాను గనకనా? నిన్ను నమ్మి నీ చేతికి ఒక్క రోలీ ఇవ్వను."

అంత మాట అనిపించుకున్నాకగాని కాంతం విరమించలేదు. తన ఓడు తెలుసుకోలేకపోవడంలో కాంతం ఎంత మూఢుడంటే, అతనితో మాట్లాడే టప్పుడు ఎంత మొహమాటస్తులుకూడా నిర్మొహమాటంగా అతనితో కుండ పగ లేసి మాట్లాడేవాళ్ళు. అట్లా మాట్లాడించుకోవటం అతనికి పరిపాటి కూడా అయిపోయింది

యశోదకి ఆస్తి వచ్చిందని తెలిసిన క్షణంనుంచీ కాంతం తను బాగుపడే మార్గం ఏదైనా ఉందా అని బుర్ర వేడెక్కేట్టు ఆలోచిస్తున్నాడు యశోదను పెళ్ళాడేద్దామా అని ఒక ఆలోచన వచ్చింది. కొంతసేపు ఈ ఆలోచన చాలా బాగున్నట్టకూడా అనిపించింది. చివరకా ఆలోచన కట్టిపెట్టాడు. యశోదకు తనమీద వ్యామోహం ఉండదనికాదు—అటువంటి సందేహం అతనికి తట్టనే లేదు. యశోదను ఎవరన్నా పెళ్లి చేసుకుంటే ఆ పెళ్ళి చెల్లదని.

పోనీ, మేనకోడలిని చాటుగా తన వలలో వేసుకుని "ఎస్టేటుకు మేనేజరు గిరీ" చేద్దామా అనుకున్నాడు. ఇది బాగానే కనిపించింది. యశోదకు తనమీద ఏపాటి వ్యామోహం ఉందో తెలుసుకోవాలిగా? ఆలోచించాడు. తనకేం లోటు? ఇంకా నలభై రెండు నిండలేదు. పాతికేళ్ళకే కుర్రాళ్ళకి జుట్టు నెరసిపోయే ఈ రోజుల్లో తన నొక్కులజుట్టు ఇంకా నిగనిగలాడుతూ తుమ్మెద రెక్కలల్లే ఉంది. తనలో ఇంకా శృంగారం చావలేదు. యశోదను చూసినా మగవాడి కోసం తపించిపోతూ ఉండాలి. ఇరవై నాలుగేళ్ళు నిండి ఇంతవరకూ పురుష స్పర్శ ఎరుగని మనిషి తనవంటివాడు దొరికితే ఎగిరిదూకకుండా ఉంటుందా? అంతా తనకు సుముఖంగానే ఉంది. కాని యశోద మోసంచేసింది. ఇంకో అయిదు నిమిషాలు నిలబడి మాట్లాడినట్టయితే తను యశోదతో, తన భార్య

పిల్లల్ని కని ఎట్లా అందవికారమైపోయిందీ, తనను ఎంతెంత అందగత్తెలు ప్రేమించిందీ అన్నీ చెప్పేద్దామనుకున్నాడు. కాని, వెర్రిమొహం, మాటలోనే జారుకుంది. ఏ బుద్ధిన ఉన్నదో మరోసారి చూద్దాం అనుకున్నాడు కాంతం. ఇది సాగే ఆలోచన కాదేమోనని అతనికి ఒక్కనాటికీ తట్టలేదు. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. అతను చవుకబారు ఆడవాళ్ళందరితోటీ శృంగారం నడిపి, రాను రాను ఆడదాన్ని గురించి చవుకబారు అభిప్రాయాలు ఏర్పరుచుకున్నాడు. తన ఆకర్షణశక్తికో కూడా వల్లమాలిన గురి తెచ్చిపెట్టుకున్నాడు.

కాంతం మళ్ళీ మర్నాడు వచ్చి యశోద వంటరిగా ఉండటం ఆసరా చూసుకుని తాపీగా ఆమె భావిని గురించి చర్చించాడు. యశోద తాపీగానే అంతా విన్నది. అతను చెప్పిందాని సారాంశమేమిటంటే, ఆస్తి రాగానే సరా? దాన్ని ఎవరు చూస్తారు? ఈ యాభై అయిదేళ్ళ వృద్ధు ఇంకా ఎంతకాలం బ్రతికి ఉంటాడు? ఆయన హరీ అంటే తర్వాత యశోద గతేమిటి? ఇంత ఆస్తి ఉండి, మొగుడూ పిల్లలూ, సంసార సుఖం లేకుండా ఎంతకాలం ఇట్లా? పెళ్లి చేసుకోకపోతే ఎవరినన్నా అందగా ఉంచుకున్నా మా బాగేగదా? ప్రపంచంలో ఎంతమంది లేరు? సింగినాదం, లోకం ఏమంటుంది? తనను లోకం ఏంచేసింది? ఎవరిపొట్ట వాడు పోసుకున్నంతకాలమూ ఎవర్నీ ఎవరూ ఏమీ చెయ్యలేరు!

అంతా విని యశోద "నువ్వు చెప్పేది నాకు చాలా అసహ్యంగా ఉంది. ఇటువంటి సలహా ఎప్పుడూ ఎవరికీ చెప్పకు" అని లేచిపోయింది. యశోద వట్టి కబుర్లకు పడదని రూఢి చేసుకుని కాంతం ఆమె వెంటపడి పట్టుకున్నాడు. యశోద పెద్ద పొలికేక పెట్టింది. కాంతం చప్పున ఆమెను వదిలిపెట్టి సాధ్యమైనంత వేగంగా ఇంటికి వెళ్ళిపోయినాడు.

కాంతం యశోదను ఏదో చెయ్యబోయినట్టు ఆనోట ఆనోట ఊరంతా పాకింది. అదివరకు కాంతంగురించి లోకులు చెప్పుకోకపోలేదు. కాని ఎందుచేతో ఈసారి చెప్పుకోవటం వెనకటిమాదిరిగా లేదు. అతను చచ్చు స్త్రీలతో సాహసం చేస్తే ఎవరికీ నెప్పిగలగలేదు. కాని పరువుగల ఆడదానిమీదికి వెళ్ళాడనగానే అందరికీ చురుక్కుమన్నది. కాంతం మనుష్యుల చూపులూ, హేళనమూ భరించలేకపోయాడు. ఒక రాత్రి పెట్టె సర్దుకుని రైలెక్కాడు.

## 3

ఆ సమయానికి పూనాలో గుర్రాలు పరుగెత్తుతున్నై. కాంతం పూనా

ప్రయాణమైనాడు అతని లెక్కలో డబ్బుకు విలువయిచ్చే దుర్వినియోగాల్లో గుర్రపు పందాలు చాలా ఉత్తమమైనవి. ఎన్‌క్లోజర్‌లోకి వెళ్ళిన క్షణంనుంచీ బయటికి వచ్చేవరకూ కాంతం పొందే బాధా, ఆనందమూ కూడా ఒక ప్రత్యేకత గలది. ఇంకేబాధనూ, ఆనందాన్ని వీటితో పోల్చటానికి లేదు. సామాన్య జీవితంలో మనుష్యప్రయత్నానికి ఫలితం ఉంటుంది. గుర్రాలపందాల దగ్గర మనిషి విధిచేత ఆటవస్తువు. బ్రహ్మదేవుడు నొసట రాసినరాత చదువుకోటానికి గుర్రపు పందాలు భూతద్దం. కాంతం మనస్తత్వం ఎటువంటిదంటే-అతనికి స్వప్రయత్నంమీద ఆధారపడి కష్టసుఖా లనుభవించటంకంటె విధి చేతి కీలుబొమ్మ అయి ఆడటం అతనికి చాలా ఇష్టం. డబ్బు వచ్చి పోయినా కూడా దేవుడే స్వయంగా ఇచ్చి పుచ్చుకున్నట్టుండేది కాంతానికి. ఎవరు ఎప్పుడు ఎక్కడ భగవత్సాక్షాత్కారం పొందుతారో ఎవరు చెప్పగలరు.''

పూనా కాంతానికి అచ్చివచ్చింది యశోద విషయం అప్పుడే మరిచిపోయాడు. గుర్రాలమీద రెండు మూడు వందలు గెలుచుకోవటానికి తనకు ఇల్లు కదలాలనే బుద్ధిపుట్టిందనుకున్నాడు. కాని తలవని తలంపుగా కాంతానికి యశోదను గురించి ఆలోచించవలసిన పనిబట్టింది.

ఒకరోజు కాంతం హోటల్లో భోజనంచేస్తూఉండగా ఒక మనిషి అతన్ని పలకరించాడు ఆ మనిషికి ముప్పై ఏళ్ళదాకా ఉండవచ్చు. అతన్ని కాంతం అదివరకు ఆ హోటల్లోనే ఒకటి రెండుసార్లు చూశాడు అతను ధారాళంగా మహారాష్ట్రం మాట్లాడేస్తూండటంచూచి, "మహారాష్ట్రులు మన తెలుగువాళ్ళల్లేనే ఉంటారు ఒక్కొక్కసారి" అని అనుకున్నాడు. ఆ మనిషి ఇవాళ తనను అచ్చ తెలుగులో "మనదేవూరు బాబు?" అని పలకరించాడు.

"ఓరి, నువు తెలుగువాడివిటోయ్? ఇక్కడ ఏంచేస్తున్నావు? ఎన్నేళ్ళయి ఉన్నావు?" అని ఖుత్తుకలిపాడు కాంతం.

అతని పేరు దక్షిణామూర్తిట. చిన్నతనంనుంచీ బొంబాయిలోనే ఉన్నాట్ట. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోతే ఒంటరిగా ఉంటున్నాట్ట. ఎవ్వరూ నా అన్న వాళ్ళు లేరట. దొరికిన ఉద్యోగం ఏదైనాసరే చేస్తూ వచ్చాట్ట, కూలిపని లగాయతూ. ప్రస్తుతం నెలనుంచీ ఖాళీగా ఉన్నాట్ట. ఈ దక్షిణామూర్తి ఒకటి రెండు సార్లు కాంతంవెంట రేస్‌కోర్సుకు వెళ్లి డబ్బొచ్చే సలహా లిచ్చాడు. అతను లేకపోతే కాంతం సెట్టి మిగిలి ఉండును.



"నువ్వు నాకు భలే అచ్చివచ్చావురా అబ్బీ! నీ కేదైనా మంచి ఉపకారం చెయ్యాలి. చేస్తాగా! నన్ను నమ్మి మోసపోయినవాడు లేడు. ఏ క్షణాన చూసినా చేతిలో దమ్మిడీ వుండకపోయినా, చేతిమీదుగా లక్షలు దాటిపోతై. చక్రం అట్లా నీ కేసి తిప్పానంటే—" అని కోతలు ఆరంభించాడు.

దక్షిణామూర్తి నవ్వి "నాకో బ్యాంకు క్యాషియరు స్నేహితుడుండేవాడు. వాడూ ఈ మాటే అనేవాడు!" అన్నాడు. దక్షిణామూర్తి ఎందుకు నవ్వాడో, ఏమన్నాడో కాంతానికి అర్థంకాలేదు.

నిజానికి దక్షిణామూర్తికి రాగి దమ్మిడీ ఇద్దామనే ఆలోచన కూడా కాంతానికి లేదు ఏదో మాటవరసకి అట్లా అనేశాడు. కాని ఆ రాత్రి కాంతానికి నిద్ర పట్టబోతుండగా ఒక బ్రహ్మాండమైన ఆలోచన జన్మ కొకసారిగాని మనిషి బుర్రలో పుట్టని మెరుపులాంటి, కళ్లు జిగేలుమనే ఆలోచన ఒకటి తట్టింది. కాంతం పక్కలో చివాలున లేచి కూర్చున్నాడు నాలుగు మంచి మాటలుచెప్పి ఈ దక్షిణామూర్తిగాణ్ని పట్టుకుపోయి, వీడే యశోద మొగుడంటే?"

## 4

ఆ రాత్రి కాంతం నిద్రపోలేదు. ఆలోచించినకొద్దీ ఈ ఆలోచన గొప్పగా, అద్భుతంగా, అమోఘంగా కనిపించింది. వీడికా, ఎవరూ లేరు. వయస్సు ఇంచుమించు లేచిపోయినవాడి వయస్సే. లేచిపోయినప్పుడా వెధవకి పది

హేనేళ్లు. వీడు వాడు కాడని ఎవరు కనుక్కుంటారూ? వీడికి పూర్వోత్తరాలన్నీ చెప్పేసి "జాగ్రత్తగా మసులుకోరా వెధవా!" అంటే సరి! ఒకసారి ఆ యశోదని; దానికెంత గీర్వాణం! వీడి పక్కలో పడుకోపెట్టేసినాక, ఆ తర్వాత వీడు కాడని ఒకవేళ తెలిసిపోయినా కుక్కిన పేనులాగా నోరు మూసుకుని ఊరుకుంటారు వీడికా ఆర్థికసమస్యా, వైవాహిక సమస్యాకూడా తపీమని ఒక్కదెబ్బతో తేలిపోతుంది. వీడు యశోద ఆస్తికి మేనేజరయితే తన పబ్బం బ్రతికున్నన్నాళ్ళూ గడుపుకోవచ్చు. వాడి గుట్టు తనకు తెలుసు గనుక వాడు తన విషయంలో బుద్ధిగలిగి మసులుకుంటాడు.

తనమీద కృతజ్ఞతకొద్దీ తనను దక్షిణామూర్తి ఒకకంట కనిపెట్టి ఉంటాడని కాంతం అనుకోలేదు అతనికి మనుషుల కృతజ్ఞతలోగాని, ఇతర మంచి లక్షణా లలోగాని విశ్వాసం లేదు.

ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు దక్షిణామూర్తిగాడితో ఇదంతా మాట్లా డేసి వాణ్ణి ఒప్పించుదామా అని కాంతం తహతహలాడాడు. తెల్లవార్లూ అతనికి నిద్రపట్టలేదు పడుకుందామని చాలా ప్రయత్నాలు చేశాడుగాని ఏమీ లాభం లేకపోయింది బుర్ర మెరుపు వేగంతో పరుగెత్తేటప్పుడు నిద్ర ఎట్లా పడుతుంది?


మర్నాడు సాయంకాలంగాని దక్షిణామూర్తిగాడు కనిపించలా కాంతం తన ప్లానంతా చెప్పాడు. మొదట దక్షిణామూర్తికి ఒక ముక్కకూడా బోధపడ్డట్టు కనపడలా. తీరా అర్థమయినాక తెల్లమొహంవేసి, "అమ్మో! ముక్కలు విరగ దన్నుతారు, చంపేస్తారు. అదదానిని గురించిన పని!" అన్నాడు. ఎంత చెప్పినా వాడు ససేమిరా అన్నాడు. వాడు మొండికెత్తినకొద్దీ కాంతానికి చిర్రెత్తుకొచ్చింది. ఇంత గొప్ప ఆలోచన తను చెయ్యటమేమిటి? ఈ అనామకకుంక దాన్ని కాస్తా ప్రతిఘటించట మేమిటి? ఇంత అవమానం కాంతాని కెన్నడూ జరగలేదు యశోద అందచందాలు వర్ణించాడు. లాభం లేకపోయింది.

"పోనీ, నువ్వు దానిజోలికి పోకు. ఆస్తి మాత్రం చిక్కించుకో. దాని ఆస్తంతా నీ పేర పెట్టకపోతే లేచిపోతానను. ఆ తరువాత చక్రం నేను తిప్పు తాను" అన్నాడు కాంతం, బలవంతాన ఓర్పు తెచ్చుకుని.

దక్షిణామూర్తి కాస్త మెత్తబడేటట్టు కనిపించాడు.

"నిజం తెలిసినాక వాళ్ళు నన్ను చంపేస్తే?" అన్నాడు.

"ఎవ్వరూ నిన్ను చంపేదీ? ముసలాడా? అదకుంకా? నా ప్రాణం నీ ప్రాణాని కడ్డేస్తున్నా? ఇది నాలికా, తాటిపట్టెరా? మంచిగా చెబితే వినుపించుకోవే?"




"నే నన్ని తప్పులు చేస్తే?"

"ఎవ్వరూ గమనించరు! అవునూ, నువ్వెప్పుడో లేచిపోయినావు. అందరి పేర్లూ మరచిపోయినావు! నీకేం జ్ఞాపకమూ పాడా? నాకు తెలిసినంతమట్టుకూ అన్ని విషయాలు నే చెబుతాలే?"

"అన్నట్టు మొదలు—నా పేరేమిటి?"

"నీ పేరు శాస్త్రి—నారాయణ శాస్త్రి. నువ్వు నీ తండ్రి కొక్కడివే. మీ నాన్న ఊళ్ళోవాళ్ళచేత తన గబ్బుతో వ్యాజ్యాలు వేయించి ఆస్తంతా కరారావుడి చేసేశాడు చివరకు నిన్నేసుకుని సత్రాలవెంట తిరిగాడనుకో. నీకు ఏ ధర్మపాఠం చదువో అంతే. అంత ఇంగ్లీషూ మాట్లాడెయ్యకు నీకు పద్నాలుగో ఏట కాబోలు పెళ్ళయింది. నీ పెళ్ళాం పేరు యశోద. దాని కప్పుడు పదేళ్ళు కామాలు. ఏదో ఏడిసింది! మిగిలిన విషయాలన్నీ నీకు పాఠం చెబుతాలే! రా. నా మాటవిని నా వెంట వచ్చెయ్యి. నే చెప్పినట్టు చేస్తివా, బాగుపడిపోతావు"

"తన పేరు పెట్టుకుని నేను వచ్చానని తెలియగానే అసలువాడు వస్తే?" అన్నాడు దక్షిణామూర్తి.

ఈ జనమేజయ ప్రశ్నలకి సమాధానాలు చెప్పే ఓపిక కాంతానికి లేదు. దక్షిణామూర్తి తన ఆలోచనను ఒప్పుకుంటాడని రూఢిఅయినాక ఇక వాడితో విశేషం మాట్లాడే ఓపిక పోయింది. కాంతానికి, పాపం స్వార్థంతప్ప ఇంకేమీ అర్థమయ్యేది కాదు.

అయితే దక్షిణామూర్తిది జలగపట్టు. హిరణ్యాక్ష వరాలన్నీ అడిగాడు. వంద ప్రశ్నలు వేశాడు. అన్నిటిమీదా తర్జనభర్జనలుచేస్తే కార్యం చెడుతుందని

కాంతం దక్షిణామూర్తి కోరిన భరవసాలన్నిటికీ తల ఊపేశాడు, వినిపించు కోనైనా వినిపించుకోకుండా.

అంతా అయినాక దక్షిణామూర్తి దమ్మిడీఅంత మొహంచేసుకుని, "ఎల్లుండి రమ్మన్నారు. తప్పకుండా ఉద్యోగం ఇస్తామన్నారు" అన్నాడు తనలో తను మాట్లాడుకుంటున్నట్టు.

"ఇంకా ఉద్యోగమేమిటి, నీ మొహం. నే నిస్తున్నది ఉద్యోగం కాదూ! అంతా సెటిలయిపోయింది ఇక మాట్లాడకు అంతే!" అన్నాడు కాంతం, మాట్లాడితే వ్యవహారం మళ్ళీ మొదటి కొస్తుందేమోనని.

దక్షిణామూర్తి చివరకు సరే ననేశాడు.

అత నా మాట అనేవరకూ కాంతానికి, వాడు సరే ననటమే తరవాయిగా తన ఆలోచన పారినట్టే నిపించింది. తీరా వాడు ఒప్పుకున్నాక చెయ్యవలసిన కార్యక్రమమంతా ముందే ఉన్నది. వీణ్ణి పట్టుకుపోవాలి. వీడే నారాయణశాస్త్రి అని నలుగురిచే ఒప్పించాలి ఎంతో మెళుకువగా వుండాలి. వెయ్యికళ్ళతో చూస్తారు. వాళ్ళు ఒప్పుకోటానికి సిద్ధంగా ఉన్నా వీడు మధ్యలో బెదిరిపోయి "నేను కాదు బాబో!" అనకుండా వుండాలి. ఆ నారాయణశాస్త్రికి ఒకవేళ తనకు తెలియని పుట్టుమచ్చలూ, కాల్పుమచ్చలూ, కొండగుర్తులూ వున్నాయో ఏమిటో? ఉంటే, తనకేం నష్టం? వీడు నారాయణశాస్త్రి కాదంటారు. వాడి దారిన వాడు పోతాడు తనని తలగొట్టి ములవెయ్యరుగదా? వీడే నారాయణశాస్త్రి అని నమ్మారా, చలమయ్యగారు వెంటనే తన చేతిలో రెండుమూడు వందలు పడెయ్యక తప్పదు- వెతకటానికయిన ఖర్చులూ ఆ పైన అన్నిటికీ భగవంతుడే ఉన్నాడు.

## 5

ఆఖరు క్షణంలో కాంతం తన ప్లాను కాస్త మార్చాడు. తను ఈ దక్షిణామూర్తిని వెంటబెట్టుకునిపోయి "ఇడుగో నారాయణశాస్త్రి" అంటే దొంగతనం బయటపడిపోవచ్చు. తన పరువుప్రతిష్ఠలు ప్రస్తుతం బాగా లేవు. అందుచేత రైలుస్టేషను సమీపంలో వుండే సత్రం అరుగుమీద కూచోమని దక్షిణామూర్తికి చెప్పి, కాంతం నేరుగా చలమయ్యగారిని చూడబోయాడు

చలమయ్యగారు బావమరిదిని చూసి "ఏం?" అన్నాడు కోపంగా.

"చూడు బావా! నీకు చాలా శుభవార్త తెచ్చా. నారాయణశాస్త్రి దొరికాడు. నేను వెతకటమూ, కనిపించకపోవటమూనా? నువ్వు వెంటనే బయలుదేరాలి మరి."




"ఎక్కణ్ణించి తెచ్చావు? అసలు నిజంగా వాడెవడు? ఇంతదూరం తెచ్చిన వాడివి ఇక్కడికే పట్టుకురాలేకపోయినావూ?"

చలమయ్యగారి మాట అనేటప్పటికి కాంతం గుండె జల్లుమన్నది. పాపిష్టి వాడు అంతా కనిపెట్టినట్టే మాటాడాడే అనుకున్నాడు. ఇంత అయినాక ఇప్పుడు జారితే లాభంలేదు.

"నా మాట నమ్మొద్దులే; నువ్వే వచ్చి చూసుకో. వాణ్ణి నేను వెంట పెట్టుకురాలేదు. రైల్లో కలిశాడు. చూడగానే పోలిక చూసి అనుమానించా. వాడు కూడా ఈ స్టేషనులోనే దిగేటప్పటికి నా అనుమానం రూఢి అయింది. సత్రంలో దిగాడు. వాడు తిరిగి ఇంటికి వచ్చే ఉద్దేశంతోనే వున్నాడని నా అనుమానం. నువ్వు కూడా చూస్తే నాకు ధైర్యంగా వుంటుంది." అన్నాడు కాంతం అతి జాగ్రత్తగా.

ఈ సారి చలమయ్యగారిలో చలనం కనిపించింది

"నిజమా, వేళాకోళమా? నీ మాట ఏది నమ్మాలో ఏది నమ్మరాదో కూడా తెలీటంలేదు "

"ఇటువంటి విషయంలో అబద్ధం చెబుతానా బావా?"

"చెబుతావు" అంటూ చలమయ్యగారు లేచి పైన ఉత్తరీయం వేసుకున్నాడు.

ఆయనా, కాంతమూ కలిసి బయల్దేరారు. వాళ్ళు సత్రం చేరేసరికి మూక ఇరవై మందికి పైగా అయింది. "చలమయ్యగారల్లుడొచ్చాట్ట!" అనే ముక్క కార్చిచ్చల్లే ఆనోటా ఆనోటా అందుకుంది.

దక్షిణామూర్తి చుట్టూ ఒక వందమంది మూగారు. అంతకంతకీ సంఖ్య పెరుగుతున్నది. చలమయ్య ఎవరో, ఆయన అల్లుడెవరో, వాడి ప్రత్యేకత ఏమిటో ఏమీ తెలీనివాళ్ళు సయితం గుంపు త్రోసుకుని, దక్షిణామూర్తి దగ్గరికి వచ్చి ఒకసారి మొహం చూసి మళ్ళీ బయటికి జనాన్ని తోసుకుంటూ వెళ్ళిపో సాగారు.

"మీరంతా ఎవరు? ఎందుకిట్లా నా చుట్టూ మూగారు? నన్నెందుకు పరీక్షగా చూస్తున్నారు?'' అని దక్షిణామూర్తి అడగనేలేదు. అతనే నారాయణశాస్త్రి అని కొందరు నమ్మటానికే అది గట్టి ఆధారమయింది.

అన్ని వందలమంది చూసినా "ఆహా వీడే నారాయణశాస్త్రి" అని బలంగా అన్నవాళ్ళు ఒక్కరూ లేరు. నిజానికి అక్కడ నారాయణశాస్త్రిని అదివరకు చూసినవాళ్ళే బహుకొద్దిమంది. వాళ్ళయినా యశోద వెళ్ళప్పుడు చూడటమే చూడటం కొందరు ''ఎబ్బే, వీడు నారాయణశాస్త్రి కాడు'' అని కూడా చప్పరించారు. కాని అందరిలోనూ ఏదో ఒక సందేహం మటుకున్నది.

"మీ దేవూరు? నీ పేరేమిటి?" అని చలమయ్యేకాక, ఇతరులుకూడా దక్షిణామూర్తిని గుచ్చి గుచ్చి అడిగారు కాని అతను బెల్లంకొట్టిన రాయిమాదిరిగా మాట్లాడలేదు. అసలు వాడికి మాటలు వచ్చునో, రావోకూడా ఎవరికీ తెలీదు

"ఆ ముక్కు చూశావా? కనుబొమ్మలు చూశావా?" అని కాంతం చలమయ్య చెవిలో రహస్యంగా ఊదాడు.

"అన్నీ చూస్తూనే ఉన్నాను నా కెక్కడా పోలిక కనిపించటంలేదు. మాటాడడేం?'' అన్నాడు చలమయ్య చిరాగ్గా.

''నేను పలికిస్తానుండు" అంటూ కాంతం ముందుకొచ్చి, "ఒరే, అబ్బీ నా దగ్గిర నీ పప్పుడకదు. వీడెవడనుకున్నావో, లక్ష్మీకాంతం రమ్మంటున్నాడంటే పోలీసు ఇనస్పెక్టరు పరిగెత్తుకు రావలసిందే. నేను కనుక్కోలేననుకున్నావా? నువ్వు నారాయణశాస్త్రివి కావూ? అబద్ధాలాడావంటే తాట వొలిపించేస్తా. చెప్పు, అవునా, కాదా?" అని గద్దించాడు

దక్షిణామూర్తి చలించలేదు.

"అరెస్టు చేయిస్తావా? పిలుచుకురా పోలీసుల్ని. నా పేరుతో నీ కేంపనీ?" అన్నాడు.

"తెలుగువాడే? తెలుగువాడే?" అని నలుగురూ హర్షించారు. వాడు తెలుగు

మాటాడటం అక్కడచేరిన జనానికి సహం రుజువనిపించింది— వాడే నారాయణ శాస్త్రి అని.

ఒక ముసలాయిన, చలమయ్య దూరపు బంధువు, జనంలోనుంచి తోసు కొచ్చి చలమయ్యతో "మీ అల్లుడొచ్చాడటగా? అడుగో, ఆ కుర్రాడుకాదూ? పోలిక బాగానే తెలిపోతోంది" అన్నాడు

"కొన్ని పోలికలున్నమాట నిజమే" అన్నాడు చలమయ్య—అంతదీతో ఏమయిందన్నట్టు

"నన్నడిగితే, వీణ్ణి ముందు మన యింటికి పట్టుకుపోవటం మంచిది. ఆడవాళ్ళు వాళ్లూ చూస్తే ఏమంటారో!" అన్నాడు కాంతం... ఈ మగవాళ్ళకన్న ఆడ వాళ్ళను నమ్మించటం సులభమనే ఉద్దేశంతో. అందరూ ఆ ఆలోచన బాగుం దన్నారు

చలమయ్యగారింటికి వెళ్ళటానికి దక్షిణామూర్తి పేచీ పెట్టాడు. ఎందు కన్నాడు. "నేను మీ రనుకునే మనిషిని కా" నన్నాడు కాని జనం వాణ్ణి దాదాపు బలాత్కరించి చలమయ్యగారింటికి పట్టుకెళ్ళారు. దారిలో దక్షిణా మూర్తిని అనేకమంది అనేకరకాల ప్రశ్నలు వేశారు. నువు నారాయణశాస్త్రివి కాకపోతే ఎవరివో చెప్పమన్నారు. నీకు బంధువులెవరున్నారు! ఈ ఊరు ఏం పనిమీద వచ్చావన్నారు. వీటికి వేటికీ దక్షిణామూర్తి సమాధానం చెప్పలేదు. వీడే నారాయణశాస్త్రి అనే అనుమానం జనానికి మరింత గట్టిపడింది

## 6

ఆడవాళ్ళు కూడా ఈ వచ్చినవాడు యశోద మొగుడవునో, కాదో తేల్చి నిర్ధారణ చెయ్యలేకపోయారు. నారాయణశాస్త్రి దూరపు బంధువులకు చలమయ్య గారు కబురుచేశారు.

"నిష్కారణంగా పిల్లదాన్ని గంగలో తొయ్యకండి. వీణ్ణి ఇంట్లో ఉండ నివ్వండిగాని, వీడే మీ అల్లుడని నిస్సందేహంగా రుజువయ్యేదాకా—ఏదీ...?" అని చుట్టుపక్కలవాళ్లు చలమయ్యగారిని హెచ్చరించారు. ఆయన మొహం చిట్లించి, "నా కాపాటి తెలీదా?" అన్నాడు.

నారాయణశాస్త్రిని చూడటానికి ఇద్దరు ముగ్గురు బంధువులు మాత్రమే వచ్చారు. నారాయణశాస్త్రి కవళికలున్నట్టు వాళ్లూ వప్పుకున్నారు. "వాడే!" అని రూఢిగా చెప్పినవాళ్లమట్టుకు లేరు. వాళ్లని దక్షిణామూర్తి గుర్తుపట్టలేదు; వాళ్లతో మాటాడలేదు: పలకరిస్తే సమాధానంకూడా చెప్పలేదు.

దక్షిణామూర్తి వచ్చి వారంరోజు లయింది. ఊళ్లోవాళ్లు తాత్కాలికంగా అతన్ని నారాయణశాస్త్రిక్రింద ఆమోదించారు. అతన్ని గురించి మాటాడే టప్పుడు గాని, అతన్ని పిలిచేటప్పుడు గాని ఆ పేరే వాడేవారు. ఒక్క చల మయ్యకు మాత్రం అనుమానం రహితం కాలేదు.

యశోద స్థితి మరీ విచిత్రంగా వుంది. ఇతను నారాయణశాస్త్రి అవునా, కాదా- అనే ప్రశ్న ఆమెను బాధించనే లేదు. ఆమెకు ఇతను ఇట్లా రావటం చాలా ఆశాభంగమయింది తన భర్త తిరిగి రావాలనీ, తను చక్కగా అందరిమల్లే అతనితో కాపరం చెయ్యాలనీ యశోద చాలా కలలు కన్నది. అక్షరాలా కలలే కన్నది. అతను రావటమూ, అందరూ అతన్ని గుర్తించటమూ అతను తన అను భవాలు అందరితోటీ చెప్పటమూ, తనతో చక్కగా మాటాడటమూ—ఇంకా ఏవేవో జరుగుతాయనుకున్నది. తీరా చూస్తే ఆదేదీ జరగలేదు. అతను పరాయి వాడికన్న దూరంగా ఉన్నాడు. అతన్ని వందలకొద్దీ మనుషులు వచ్చి నఖశిఖ పర్యంతమూ పరీక్షించి అవుననీ; కాదనీ కూడా చెప్పరు. ఈ వారంరోజుల్నించీ అతను బోనులో పులిలాగా ఉన్నాడుగాని అత్తవారింటి కొచ్చిన అల్లుడల్లే లేడు.

రెండు మూడు రోజుల క్రితం ఒకరాత్రి అతను చలమయ్యగారిమీద తాచు పాముల్లే లేచాడు.

"నేను మీ అల్లుణ్ణి మీ ఇంట్లో ఉంచుకోండి అని మిమ్మల్ని నేను బ్రతి మాలలేదు. నేను మీ అల్లుణ్ణని మీకే అనుమానం వేసింది. తెచ్చి ఇంట్లో పెట్టు కున్నారు. కాదని తోస్తే చెప్పండి, నా దారిన నేను వెళ్ళిపోతాను. నా నోట చెప్పవలసిన అవసరంలేదు. నన్ను చొక్కాలు విప్పి పరీక్ష చేశారు. పళ్ళు పరీక్ష చేశారు. కళ్ళూ, ముక్కూ, చెవులూ పరీక్ష చేశారు ఇంక నన్నేం అడుగుతారు? అంత గుర్తుపట్టలేని అల్లుడు మీకు లేకపోతే ఏం పోయింది?" అన్నాడతను.

ఈ మాటలు పక్కనించి వింటున్న యశోదకి అతనిమీద కోపంతోపాటు గౌరవం కూడా కలిగింది.

ఆ మర్నాడు ప్రొద్దునే అతను యశోద దగ్గిరికివచ్చి "ఈ ఇంట్లో నా స్థితి ఏమిటో అర్థం కాలేదు. నాకో అణా డబ్బులు కావలిస్తే ఎవరిస్తారు? ఎవరన్నా ఇస్తారా? నాకు నేను సంపాదించుకో వచ్చునా?" అన్నాడు. యశోద నిర్ఘాంత పోయింది. అతని ధార్మికం ఆమెకు అర్థంకాలేదు. డబ్బు కావలిస్తే అడగరాదా? అడగటానికి నామోషీ అయితే మానరాదా?



ఆమె సమాధానం చెప్పే లోపుగా చలమయ్య వచ్చి "ఏమిటోయ్? అట్లా ఉద్ధరింపుగా మాటాడతావేం? డబ్బులు కావలిస్తే పుచ్చుకో" అన్నాడు.

"మీకింకా తెలీలేదల్లే ఉంది. మీఉద్ధరింపుకోసం కాకపోతే నేను నా ఉద్ధరింపు కోసం ఇక్కడ ఉండలేదు. నేను మీ అల్లుణ్ణి అవునో కాదో మీరు ఋజువు చేసుకుంటున్నారు. మీ పరీక్ష అయేవరకూ మీ ఉద్ధరింపుకోసం నేనిక్కడ ఉంటున్నాను. రేపు నేను మీ అల్లుణ్ణి కానని రుజువై మీరు నన్ను వేంచెయ్యమంటే నేను వేంచెయ్యాలి. అట్లాకాక నేనే మీ అల్లుణ్ణయితే నాతో ఏం చెయ్యాలో మీ రప్పుడు తేల్చుకుంటారు! ఈ సంగతి మీకింకా తెలీదల్లే ఉంది" అన్నాడు దక్షిణా మూర్తి వెటకారంగా.

"నువ్వూరుకో నాన్నా!" అన్నది యశోద, తప్పంతా దక్షిణామూర్తిది అని స్ఫురించేటట్టుగా. ఆమె లోపలికి వెళ్ళి అయిదురూపాయల నోటొకటి తెచ్చి అతని చేతిలో పెట్టి "చాలా?'' అన్నది

"కావలసినప్పుడు మళ్ళీ అడుగుతాను!'' అన్నాడతను వెటకారంగా.

ఈ రోజు తను ఉదయం బయటికి వెళ్ళినవాడు పదిగంటలయినా ఇంటికి రాలేదు. యశోదకు రకరకాల అనుమానాలు తగిలినై. కోపంవచ్చి లేచిపోయి నాడేమో అనుకుంది. ఈ అనుమానం కలగగానే అతను తన మొగుడేనని

ఆమెకు రూఢి అయింది. అతన్ని తగినంత మర్యాదగా తనుగాని, తన తండ్రిగాని చూడటంలేదేమో అని ఆమెకు అనుమానం తగిలింది. దేవుడి దయవల్ల అతడు లేచిపోకుండా ఉంటే ఇకముందు అతన్ని ఎంతో గౌరవంగా చూద్దామనుకుంది. దొరికిన మొగుణ్ణి పోగొట్టుకున్నానా అని అనుమానం తగిలి కళ్ళ వెంబడి నీళ్ళుకూడా కారాయి. ఇన్నాళ్ళ కామెతో అతనిమీద ఏదో చెప్పరాని మమకారం ఒకటి అంకురించింది.

ఇంతలో పక్క ఇంటి కుర్రవాడు రొప్పుకుంటూ పరుగెత్తుకొచ్చి, "యశోదమ్మత్త య్యోవ్! మరే-మరే-నీ-నీ మొగుడేమో, ఆ సత్రం దగ్గిర హోటల్లో, అందరికీ ఇడ్డెన్లూ అవీ ఇస్తున్నాడు?" అని కబురు చెప్పాడు.

ఆ మాట నిజమే. దక్షిణామూర్తి ఆ రోజు ఉదయమే స్టేషనుదారిలో ఉన్న ఒక హోటల్లో సర్వరుగా చేరాడు. తిన్నంత టిఫిను పెట్టి నెలకు పదిహేను రూపాయలిస్తారు.

ఉదయం వెళ్ళినవాడు సాయంకాలం ఆరింటికి ఇంటికివచ్చి. "స్నానం చెయ్యటానికి వేడినీళ్లు కావాలి" అని యశోదతో చెప్పాడు.

"ప్రొద్దున వెళ్ళి ఇప్పుడా వస్తున్నారు?" అన్నది యశోద అతను అడిగిన దానికి సమాధానం చెప్పకుండా.

"అవును. నీ కళ్ళను నువ్వే నమ్మవా," అన్నాడు దక్షిణామూర్తి.

"హోటల్లో పని చేస్తున్నారా?" అన్నది యశోద. ఆ మాటలు తన నోట అనటమే ఎంతో బాధ అయినట్టు.


"ఏం? కూడదా?" అన్నాడు దక్షిణామూర్తి.

"ఫలానివారి అల్లుడు హోటల్లో చేరాడంటే అప్రతిష్ఠ కాదా,"

"నే నెవరి అల్లుణ్ణి?" అన్నాడు దక్షిణామూర్తి ఆశ్చర్యం అభినయించి

"అందరూ అనుకోటం మీరు మా నాన్న అల్లుడనేగా? కారని తెలిసేదాకా కాస్త మా నాన్న పరువు నిలబెట్టండి. ఆ దిక్కుమాలిన హోటలుపని మానెయ్యండి?" అన్నది యశోద

హోటల్లో సర్వరుగా ఉండటం పరువు తక్కువా? హోటళ్ళలో తినటమే పరువైనపనా? ఈ రహస్యం నా కదివరకు తెలీదు. మీ చేతా, మీ తరపున ఊళ్లో వాళ్ళందరిచేతా చేయించుకోటంకాక మీ పరువు నిలబెట్టే భారంకూడా నా మీద ఉందని నే నెరగను. నిన్న నీ దగ్గిర ఆ అయిదు రూపాయలూ పుచ్చుకున్నంత హీనంగా మళ్ళా మళ్ళా డబ్బు పుచ్చుకోవటంకంటే నాకు హోటల్లో




సర్వరుగా చేరటం చాలా గౌరవంగా కనిపిస్తున్నది. అదీకాక అదివరలో నేను అంతకన్న నీచమైన కూలిపని కూడా చేసి పొట్ట గడుపుకున్నాను. కనుక నాకు ఇది ఎంతో గౌరవమైనపనిగా కనిపిస్తున్నది" అన్నాడు.

యశోదకు చర్రున కోపం వచ్చేసింది. "పరీక్ష చేశారంటారు, మాట మాటాడితే. ఫలానా అని మీరు చెప్పరు. మమ్మల్ని తెలుసుకోనివ్వరు మీరీ మాట అనటం ఇది మొదటిసారి కాదు" అన్నది.

మామూలుగా మాట్లాడితే ఎగిరిపడేవాడల్లా యశోద ఆగ్రహానికి నవ్వాడు.

"పిచ్చిదానా, నే నివాళే కళ్ళు తెరవలేదు. నాకు ముప్పై ఏళ్ళు మీద పడినై. నేనే నారాయణశాస్త్రినంటే పరీక్ష చెయ్యడం మానేసి, నీకూ నాకూ ఈ రాత్రి పాన్పు వేస్తారా? ఎందుకీ కబుర్లు?" అన్నాడు.

యశోదకు ఈ మాట దెబ్బల్లే తగిలింది. ఆ దెబ్బకి తెప్పరిల్లుకొని "అయితే మీరా దిక్కుమాలిన హోటలుపని మానరా?" అన్నది.

"ఎందుకు మానాలో నాకు తెలియటంలేదు. నేనా పెద్ద చదువులు చదివినవాణ్ణి కాను. నాకా డబ్బు ముష్టెత్తటం ఇష్టంలేదు. అందుచేత నా తిప్పలు నే పడతాను. నన్నీపని చెయ్యమనిగాని, వద్దనిగాని చెప్పటానికి ఈ ఇంట్లో ఎవరికీ హక్కులేదు. నేను ఇంకొకరి స్వేచ్ఛను అరికట్టను. నా స్వేచ్ఛకు ఇంకొకరు అడ్డంరావద్దు. నేను ఎటువంటి నిర్బంధాలూ ఎరగనివాణ్ణి. మీ నాన్నగార్ని కూడా నాతో ఈ విషయం మాటాడవద్దని చెబితే సంతోషిస్తాను. మీ బలవంతంమీద నే నీ ఇంట్లో ఉండటంలేదు. బుద్ధిపూర్వకంగా ఉంటున్నాను. నా కేరోజు ఇక్కడ ఇబ్బందిగాతోస్తే ఆ రోజు బయటికి వెళ్ళిపోతాను" అన్నాడు దక్షిణామూర్తి.

యశోదకు ఇతని గొడవ ఏమీ అర్థంకాలేదు. అతను మాట్లాడే ధోరణి ఎంత ఎబ్బెట్టుగా ఉన్నా, అతని మాటలు వింటుంటే అట్లా మాట్లాడే అధికారం అతనికున్నట్టే కనిపించింది. ఆమె కంతా అయోమయంగా ఉంది. యదాలాపంగా ఆమె వంటింట్లోకి వెళ్ళి వంటపని చూసుకోసాగింది. ఒక అరగంట అయినాక అకస్మాత్తుగా ఆమెకు, అతను వేడినీళ్ళగిడినట్లు జ్ఞాపకంవచ్చి గుండె గుబుక్కుమని గబగబా ఇంత నిప్పుపట్టుకెళ్ళి బాయిలరులో వేసింది.

## 7

ఇంకొక వారం గడిచింది ఈ లోపుగా చెప్పుకోదగ్గ విషయం ఒకటే జరిగింది అదేమిటంటే, కాంతం దక్షిణామూర్తి పనిచేసే హోటలుకు వచ్చి అతనితో చాటుగా మాట్లాడాడు.

"ఇదేమిట్రా, నీ ఖర్మకాలా! హాయిగా ఎస్టేటు తాళంచెవులు పుచ్చుకోరా, అని నిన్ను గారెలతట్టలోకి తంతే బయటికివచ్చి ఈ బాదఖోపని చేస్తున్నావేమిటి? ఇంకా నీకూ దానికి మనస్సు కుదరలా?" అన్నాడు కాంతం.

"నా కా అమ్మాయిని చూస్తే అసహ్యంగా ఉంది. అట్లా మాట్లాడుతుందేమిటి?"

"నువ్వు అట్లాగే మాట్లాడుతున్నావుటగా? వాళ్ళు గోలెత్తుతున్నారు."

"ఇంకా తేలికలో పోనిస్తున్నా" అన్నాడు దక్షిణామూర్తి మొహం చిట్లించి.

"నీ బ్రతుకు వాళ్ళెప్పుడు కనుక్కుంటారో అని నేను భయపడి చస్తూంటే నువ్వేమో ఎంతకీ ఏమీ చెయ్యవేం? నువ్వు నారాయణశాస్త్రివి కావని తెలియగానే ఏంచేస్తారో తెలుసుగా?"

"నే నెవర్నో కనుక్కోవటానికి వాళ్ళ తల్లో జేజమ్మలు దిగిరావాలి'' అన్నాడు దక్షిణామూర్తి గర్వంగా.

"కుర్రతనం! కుర్రతనం! కార్యవాదం అది కాదు. ఆ యశోదను మంచి చేసుకో. అది చెప్పినట్లల్లా విను ప్రతిదానికి దానిమీదే ఆధారపడి ఉండు. ఈ వెధవపని మానెయ్యి దాన్ని మెల్లగా బుట్టలో వెయ్యి ఆ తరువాత నిన్ను కదిలించేవాడుండడు. నాకు అర్జంటుగా కొంత డబ్బు కావాలి. ఆ మాటకొస్తే, పాపం, నీకు మట్టుకు డబ్బవసరం లేదూ? డబ్బు లేకుండా ఎవరికి మట్టుకు ఎట్టా గడుస్తుందోయ్?"

"కనకనేగా ఈ ఉద్యోగం చేస్తున్నానూ?" అన్నాడు దక్షిణామూర్తి.

"నీ మొహమల్లే ఉంది ఈ ఉద్యోగం. నీ డబ్బుకోసమే నువ్వు ఈ అరవ

దాకిరీకి దిగితే ఇక నా కేమిప్పిస్తావూ? ఇందుకా నిన్ను చలమయ్య గారింట చేర్పించింది?"

"మీకు దబ్బివ్వటం ఒకటా? తనకు దూర కంత లేదు, మెడకొక డోలట! నాకే వాళ్ళ డబ్బు పుచ్చుకోవటం అవమానంగా ఉంటే నీకూ కూడా ఎక్కడ ఇప్పించను?"

"ఇది మరీ బాగుందిరోయ్? నీకా పిల్లా అక్కర్లేదు, డబ్బూ అక్కరేదు. ఇక నా వెంట ఎందుకొచ్చావ్?"

"నాకేం తెలుసూ! మీరు రమ్మంటే వచ్చా "

"ఏడిసినట్టుంది! యశోదకి ఏటా రెండువేల రూపాయలు వస్తాయి. నీకూ నాకూ చెరిసహం తెలిసిందా? అసలా అస్తంతా నీ పేర పెట్టించుకుందూ! తరువాత గ్రంథం నే నడుపుతానూ!"

"ఛీ, ఛీ! ఆడదాని ఆస్తి కాశపడతానా? తట్టలన్నా మె స్తాను!"

కాంతానికి కోపం వచ్చింది వీడు తనని తోడుదొంగ చూడదగినంత గౌరవంగా చూడటంలేదు సరికదా, తనకేమిటో ధర్మపన్నాలు చెబుతాడేమిటి? వీడి వాలకం చూస్తే తననెత్తిన టోపీ పెట్టేసి అస్తంతా తానే కాజేద్దామనుకుంటున్నాడల్లే ఉంది. వీడిదంతా దొంగవేషమే. ఈ హోటలు పని దొంగవేషమే. యశోద తనకు బాగా లేదనటమూ దొంగవేషమే. ఏదో నాటకం ఆడుతున్నాడు. తనంత పరస్త్రీ విముఖుడూ, డబ్బు దగ్గిర మానవంతుడూ లేడనీ ఆ పిచ్చివానిని నమ్మించటానికి పెద్ద ఎత్తు ఎత్తాడు! అమ్మ వెధవకానా!

"ఒరే, నీ దొంగవేషాలు నా దగ్గిర సాగవు. నాకు కోపం వచ్చిందంటే ఏం చేసినా చెయ్యగల్ను. జాగ్రత్త. నువ్వు వెంటనే ఈ పని మానేసి ఇంటిపట్టున ఉండి రోజల్లా యశోదకి గుగ్గిలం ధూపం వెయ్యి. లేకపోతే చెడతావు చెడతావు, చెడతావు! నే నిన్నిమాట్లు చెప్పేవాణ్ణి కాను. కబడ్దార్!" కాంతం లోలోపల దిగులుపడుతూ వెళ్ళిపోయాడు.

పైకి ఎంత దంభాలు పలికినా నిజంగా వాణ్ణి తను చెయ్యగలిగింది ఏముందో కాంతానికి తెలియలేదు. "వీడు నారాయణశాస్త్రి కాదు. వీడిపేరు దక్షిణామూర్తి. నేనే వీణ్ణి తెచ్చి మీ అల్లుడని నీ నెత్తిన రుద్దాను" అని తను వెళ్ళి చలమయ్యగారితో అనవచ్చు. కాని ప్రయోజనం?

తన బెదిరింపుతో దక్షిణామూర్తిని తా రెత్తించానని ఒకవేళ కాంతం అనుకుంటే అతను చాలా పొరపాటుపడ్డాడు. ఎందుకంటే దక్షిణామూర్తి హోటలు

పని మానలేదు. అతను మళ్ళీ యశోదను డబ్బు అడగనూ లేదు. ఆమె తనంతట తనే, "మీకేమైనా మళ్ళీ డబ్బు కావాలా" అని అడిగితే "అవసరంలేదు, అంతగా అవసరమైతే నే నే అడుగుతాను" అన్నాడు. యశోద ఈ మాటకు నొచ్చుకున్నది.

ఆమె మొహం చూసి ఆ సంగతి కనిపెట్టాడు.


"నేను గట్టిగా నిన్ను డబ్బడిగితే నొచ్చుకున్నావు. అసలు అడక్కపోతేనూ నొచ్చుకుంటున్నావు. నీకు డబ్బున్నందుకు నాకు అయిదు రూపాయల నోట్లు పరంపర ఇస్తే నీకు తృప్తిగా వుంటుంది. డబ్బు పాపిష్టిది: కవిత్వం చెప్పగల వాళ్ళు కవిత్వం అర్థంకానివాళ్ళ మెప్పు కోరరు. ఇంకేది ఉన్నా మనుషులు అది కావలసినవాళ్ళకే అందించాలని ప్రయత్నిస్తారు. డబ్బు అట్లా కాదు. అవసరంలేని వాళ్ళకే దబ్బివ్వబుద్ధి అవుతుంది. ఇన్నవాడు ఉన్నవాడికే పెడతారు. మా హోటల్లో ఖాతాగా తిని మూడేసినెలలు బాకీలున్న వాళ్ళున్నారు వాళ్ల డబ్బున్న స్నేహితుల్ని తెచ్చి ఖాతాలో రాసి మేపుతారుగాని, ఆ ఖాతాలో నేరాసి బయట అడుక్కునేవాళ్ళకి ఒక ఇడీముక్క పారెయ్యరు ఎందుచేతా? కల వాళ్ళని మేపితే వీళ్ళకి గొప్ప బీదాబిక్కీ తిండే వీళ్ళకేం గొప్పా?"

ఈ మాటకి యశోద మరింత బాధపడ్డది. తననీ విధంగా మాటలతో హింసించటానికి అతనికేమధికారం ఉందో ఆమె కర్థంకాలేదు అతను వలానా అని ఇంకా నిర్ధారణకూడా కాలేదు ఆ మాట పైకనేద్దామా అని కూడా అనిపించింది గాని, నోరు కట్టుకున్నది

## 8

అకస్మాత్తుగా దక్షిణామూర్తి హోటల్లో ఉద్యోగం పోయింది. అతను హోటలు యజమానిని కొట్టాడు హోటలు యజమాని కేసు పెట్టాడు. మేజిస్ట్రేటు దగ్గిర దక్షిణామూర్తి హోటలు యజమానిని కొట్టానని ఒప్పుకున్నాడు. అతనికి పది రూపాయలు జరిమానా పడింది.

"నా దగ్గిర దబ్బులేదు. కావలిస్తే జైల్లో కూచుంటాను" అన్నాడు దక్షిణామూర్తి చలమయ్యగారు పదిరూపాయలూ ఇచ్చి అతన్ని విడిపించుకున్నాడు. యీ దెబ్బతో అతని గీర్వాణం అణుగుతుందని యశోద అనుకుంది. ఇటువంటివి జరుగుతున్నకొద్దీ అతనికి తనకూ మధ్య ఉన్న ఎడం ఎక్కువవుతున్నది గాని తగ్గటంలేదు



యశోద పొరపాటుపడింది. జైలునుంచి దక్షిణామూర్తి ఒక్క రవ్వయినా మారకుండా వచ్చేసాడు.

"మీరు డబ్బున్నవాళ్ళుగనక తప్పక డబ్బు దుర్వినియోగం చేస్తూ ఉంటారు. అయితే ఇవాళ మీరు నా కోసం ఖర్చుపెట్టిన పదిరూపాయలూ చాలా సద్వినియోగమయినందుకు మీరు సంతోషించాలి!" అన్నాడు ఇంటికివచ్చి.

"నా డబ్బు ఇంత దుర్వినియోగం ఎన్నడూ చెయ్యలేదు. ఒక నెల జైల్లో వుంటే బాగుపడేవాడేమో! నిష్కారణంగా పదిరూపాయలు ఖర్చుచేసి నీకా అవకాశం లేకుండా చేశాను!" అన్నాడు చలమయ్యగారు అప్రయత్నంగా ఆయనకు నోటంబడి కాంతంతో మాట్లాడే భాషే వచ్చింది అయితే దక్షిణామూర్తి కాంతంమాదిరిగా మాటపడి ఊరుకోలేదు.

"మీరు నా మీద ప్రేమకొద్దీ పది రూపాయలివ్వలేదు. మీ అల్లుడు – పోనీ తత్తుల్యుడు – జైల్లోపడితే నామోషీ అని విడిపించారు" అన్నాడు.

"నీ వాలకంచూస్తే నీకు జైలు పరిపాటి అయినట్లుంది!" అన్నాడు చలమయ్యగారు.

"మీకు చెప్పలేదా నేను? వెనక ఒక ఫ్యాక్టరీలో సమ్మె నడిపినందుకు నన్ను నెలరోజులు దేవతాపులుసు తాగించారు."

చలమయ్యగారు నిస్పృహతో "ఎబ్బే, నీకు సిగ్గూ శరమూ లేకుండాపోయినై. ఎప్పటికీ మామూలు మనిషి కాలేవు రాసిస్తా." అన్నాడు.

"చెప్పలేం! ఏదన్నా ముదనష్టం కలిసివస్తే ఎట్లా మారతానో? డబ్బు జబ్బుతో తీసుకుంటున్నారుగాని, మీకు దాని తత్వం నాకు తెలిసినట్టు తెలీదు" అన్నాడు, దక్షిణామూర్తి.

ఇది క్షమించరాని దెబ్బ. చలమయ్య కోపంతో ఒణికిపోయినాడు.

"బుద్ధితక్కువ గాడిద ! మదనష్టం కావుకు దామనే వచ్చావు ! నిన్నివాళ జైల్లోనుంచి విడిపించింది ఆ మదనష్టమే ! తాగినవాడి కూతలు కూస్తావా ? జాగ్రత్త" అని పెద్దపెట్టున అరిచాడు.

దక్షిణామూర్తి చిరునవ్వు నవ్వాడు.

"ఇదే నేనంటున్నది ! తలకి రక్తంపోటు, మాట తడబడటం, అవతల మనిషి వేలిగాడంతగా కనపడటం, అబద్ధాలాడటం, డంభాలు పలకటం. కొండంతెత్తు మనిషి ననుకోవటం, అంతా డబ్బుజబ్బు ! నేను రాలేదనీ, రానో అంటుంటే నన్ను బలవంతంగా తెచ్చారనీ, నేను బుద్ధిపూర్వకంగానే జైలుకుపోతే, నా అనుజ్ఞ లేకుండా నన్ను మీరు విడిపించారనీ తరవాత మీతో మనవిచేసుకుంటా! ఇప్పుడు మీ తల వేడెక్కివుంది. ఊళ్ళో అందరూ మదనష్టం అంటున్నారని - మీకు తెలుసు. నే ననటం మీ పంచ చేరిన ఒక హోటలు సర్వర; మీ ఎదుటే అనటం - భరించరానిదయింది !" అంటూ అతను తన గదికేసి వెళ్ళాడు.

మధ్యదారిలో అతనికి యశోద అడ్డు తగిలి, "ఆయన పెద్దవాడు. ఆయనేమన్నా అంటే పట్టించుకోకండి. ఆయనకు నిష్కారణంగా కోపం తెప్పిస్తే మీకేం ఒరుగుతుందీ ? మీ మాటలు న్యాయంగా ఉండొచ్చుగాక ! సౌమ్యంగా కూడా ఉంటే ఎంత బాగుంటుంది ?" అన్నది.

దక్షిణామూర్తి తల వంచుకుని ఒక్కక్షణం ఏమీ అనలేదు. చివరకు అతను తలఎత్తి "మీ ఇంట్లో ఉండే సంస్కారం నేను గౌరవించగలిగితే మీతో ఎంత తియ్యగానైనా మాట్లాడగలను కాని నేను నిజమైన జీవితం చూశాను నా కళ్ళకి ఒక రూపాయి కాసు ఎన్నడూ అడ్డురాలేదు. మీరు మర్యాదకింద జమకట్టే వంచనలో నాకు నమ్మకం లేదు. నన్ను తగినంత గౌరవంతో చూడటం మీరు నేర్చుకోవాలి. నా విశ్వాసం మీ కెంత బాధ కలిగిస్తుందో, మీ విశ్వాసాలు నా కంతకంటే బాధ కలిగిస్తున్నాయి. అయితే ఏమిటంటే నేను మీ అంత సున్నితమైన మనిషిని కానని మీ విశ్వాసం. పొరపాటు ! నాకూ అభిమానం ఉంది. నాకూ అహంకారం ఉంది ఎవరినన్నా దగాచేసి మీ నాన్న ఎంతగా సంతోషిస్తాడో, నా కూలిపని నేను బాగాచేసి అంతకన్నా ఎక్కువే సంతోషిస్తాను. మీ నాన్నని ఇతరులు దేవుడల్లే చూస్తేగాని ఆయనకి ఆనందం కలగదు. నన్ను ఎవరు మనిషల్లే చూసినా నా కానందం కలుగుతుంది" అని ఆమె మాట్లాడేలోపుగా తన గదిలోకి వెళ్ళిపోయినాడు.

# 9

దక్షిణామూర్తి హోటలు యజమానిని కొట్టటం కథ అక్కడితో ఆగిపోలేదు. దాని కారణం క్రమంగా బయటికి వచ్చింది ఆ హోటల్లో ఒక శూద్రపిల్ల కప్పులు కడుగుతుంది. దానికి కొత్తగా పెళ్ళయింది. మొగుడు ఎక్కడో పనిచేసుకుంటున్నాడు. వాడికి నెల్లాళ్ళనుంచీ పనిలేక పెళ్ళాన్ని తల్లి దగ్గిర ఉంచాడు. తల్లి రోగిష్టిముండ కావటంవల్ల దాని పనిలోకి ఈ పిల్ల వచ్చింది హోటలు యజమాని దానిమీద కన్నేశాడు. దానికి ఒక రవికగుడ్డ కొనిపెట్టి, ఇంటికి పొయ్యేటప్పుడు అదనంగా ఒక పావలా చేతిలోపెట్టి, ఇట్లా కొన్నాళ్ళు చేశాడు. ఒకరోజు దాన్ని పదిగంటలయినాక ఉండమన్నాడు. దానికి భయంవేసింది. అది దక్షిణామూర్తితో ఇట్లా అంటున్నాడని చెప్పింది నే చూస్తాలే అని దక్షిణామూర్తి మామూలు ప్రకారం ప్రొద్దుకూకగానే ఇంటికొచ్చి అన్నం తిని మళ్ళా హోటలుకు వెళ్ళాడు ఇంకా అంతా వెళ్ళలేదు దక్షిణామూర్తి లోపలికివెళ్ళి ఒక కుర్చీమీద కూచున్నాడు. హోటలు యజమాని అతన్ని గమనించనట్టు నటించాడు. గడికి అందరూ వెళ్ళారు. గిన్నెలు కడిగే పిల్ల ఒక మూలగా నిలబడ్డది డబ్బు లెక్కపెట్టుకోవటం చాలించి యజమాని తలఎత్తి దక్షిణామూర్తిని చూసి "ఏం పనిమీద వచ్చావు ?" అన్నాడు.

"ఏం లేదు. ఈ పిల్లకోసం వీళ్ళమ్మ కనిపెట్టుక్కూచుంది. పనికాగానే పట్టుకుపోదామని వచ్చాను" అన్నాడు దక్షిణామూర్తి

"నీ సొంతపనిమీద కాదుగదా ?" అన్నాడు యజమాని

"అందరూ ఒకటిగానే ఉంటారా ?" అన్నాడు దక్షిణామూర్తి.

యజమాని యజమానిననే అహంకారంతో దక్షిణామూర్తినీ, అతని పెళ్ళాన్నీ కూడా తనే పెట్టిపోషిస్తున్నట్టు మాట్లాడాడు. దక్షిణామూర్తి కొట్టాడు దెబ్బల దాకా వచ్చినా యజమానికి తాహతులేదు. అతని గల్లాపెట్టి దక్షిణామూర్తి పిడికిలికి అడ్డంరాలేకపోయింది. గల్లాపెట్టెను అంతదాకా నమ్ముకోవటంలో హోటలు యజమాని యిలా అవివేకంగా ప్రవర్తించాడు.

ఈ జరిగిన విషయం కొద్ది మార్పులతో ప్రచారమయింది. దక్షిణామూర్తికీ దానికీ సంబంధం ఉందనీ, దానికోసం ఇద్దరూ పోట్లాడుకున్నారనీ, మంచివాడు గనక హోటలు యజమాని దక్షిణామూర్తిమీద చెయ్యి చేసుకోలేదనీ, దక్షిణామూర్తికి వివేకం లేక చెయ్యిచేసుకున్నాడనీ కథలు బయల్దేరినై.

జైలునుంచి వచ్చిన మర్నాడే దక్షిణామూర్తి యశోదని అడిగాడు, ఆ పని

చేసేదాన్ని యింట్లో పెట్టుకోమని. యశోద సరే అన్నది. ఆ పనిదానికి, దక్షిణా మూర్తి జైలుకూ సంబంధం ఉందని కూడా ఆమె కప్పటికి తెలియదు. త్వరలోనే ఈ విషయం ఆమెకు తెలిసింది.

ఇరుగుపొరుగు అమ్మలక్క లనుకున్నారు "ప్రజ్ఞంటే అట్లా ఉండాలి ముండను తెచ్చి పెళ్ళానికి చాకిరీకి పెట్టాడు, తస్సాదియ్యా !"

అసలే యశోద మనస్సు సరిగాలేదు. తనకు సంక్రమించిన ఆస్తికే తను వారసురాలు కాదని ఎవరో దావా వేస్తున్నారనీ, పొలంచేసేవాళ్ళకు ఇంజక్షను కూడా ఇచ్చారనీ, వచ్చేపంట వాళ్ళదగ్గిరే ఉండిపోతుందనీ చలమయ్య అన్నాడు. ఆయన మాటలు మాస్తే ధైర్యంగానే వున్నాడుగాని వైఖరిచూస్తే లోపల జంకు గానే ఉన్నాడు. న్యాయమనేది డబ్బుతో కొనదగిన వస్తువు. ఆ మాట ఆయనకూ తెలును. అవతల మోతుబరులు. ఎన్ని కోర్టులైనా ఎక్కుతారు, ఎంత డబ్బయినా ధారపోస్తారు వ్యాజ్యం అంటే తన సొంత ఆస్తి కరిగించి డబ్బు కుమ్మరించాలి. దానికి చలమయ్యగారు సిద్ధంగాఉన్నట్టే కనిపించారు.

ఈ వార్తతోపాటు, రామాయణంలో పిడకల వేటలాగా, ఈ పనిదానికీ తన మొగుడికీ రంకొకటి వున్నట్లు ఆ వేళే తెలిసింది. పని పోయింది కనక దక్షిణా మూర్తి యింట్లోనే వున్నాడు. యశోద అతని దగ్గరికిపోయి "నన్నెందు కిట్లా పరీక్షచేస్తున్నారు? నేను మీకేం ద్రోహంచేశాను?" అని అడిగింది.

"నేను నీకేం ద్రోహంచేశాను?" అన్నాడు దక్షిణామూర్తి.

"రొమ్ముమీన కుంపటల్లే మీ పనిదాన్ని నా మీదెందుకు తెచ్చిపెట్టారు? అందరూ నన్నుచూసి నవ్వుతున్నారు"

"మన మధ్యతరగతి వాళ్ళకి ఒక బాధ? నా పనిమనిషంటావేం? నీకు పని చెయ్యనంటుందా ఏం?"

"మీకూ, దానికీ ఏదో వుందిటగా?"

"అసూయా?" అన్నాడు దక్షిణామూర్తి.

"నా జన్మకి అసూయ కూడానా! మీ కా మనిషిమీద ఇష్టంవుంటే దాని జీతం డబ్బులు నా చేతే ఇప్పించాలా?" అన్నది యశోద.

"నిన్ను ఊరికే ఇమ్మనలేదే. దానిచేత పని చేయించుకుంటావు. డబ్బు లిస్తావు. మెహర్బానీ ఏమీలేదు."

"మన దాంపత్యం ఇట్లా వుండటం చాలక దీన్ని ఈ యింట్లోనే ఎందు కన్నాను. దాన్ని పంపించెయ్యండి."



"నాకు మాటకుమాట చెప్పే జబ్బుంది. మన దాంపత్యం ఇట్లా వుందంటే అందులో నా తప్పేమీ లేదు. దాన్ని కావలిస్తే నువ్వే పంపించెయ్యి. దానికీ నాకూ నువ్వనుకునే సంబంధం ఏమీలేదు. ఆ హోటలు వాడన్నమాటే నువ్వూ అంటున్నావు. డబ్బు సంపాదించే పద్ధతినిబట్టే మాటల సొంపూ వుంటుంది కామాలు. నేను నీకోసం పత్తిత్తల్లే కూచున్నాననిమాత్రం అనుకోకు. నా కోసం నువు పత్తిత్తల్లే కూచున్నావా అని నేను నిన్నడగలేదు" అన్నాడు రోషంగా.

"నేను అనని మాటలక్కూడా దేనికి దెప్పుతారూ ?"

"ఎవరో కూసిన కూత నమ్మి నాకూ, దానికీ ఏదో వుందని నువ్వు నమ్మావా లేదా ? ఇది నిజమా అని అయినా నన్నడిగావా ? నాకు లేని రంకు గురించి నువ్వు నిజం పట్టుకోవచ్చు. గాని నీకు లేని రంకు గురించి నేను విచారించటం లేదనికూడా అనరాదా ? నా కొక నీతి, మీ అందరికి వేరే నీతి ఎందు కమలు జరుగుతున్నదీ నా కర్థంకాకుండా వుంది" అన్నాడు.

పరాభవం పొందినదానల్లే యశోద వెళ్ళిపోయింది.

## 10

ఆస్తి దావా గొంతుమీదికి వచ్చేసింది. చలమయ్యగారు ఎంత యిష్టంలేక పోయినా కాంతం సలహా సహకారాలు తీసుకోక తప్పలేదు. యిద్దరూ కలిసి

పట్నం వెళ్ళారు, పెద్ద లాయర్లతో మాటాడటానికి. వాళ్ళు బోలెడంత 'లా' మాటాడారుగాని ఒకరు చెప్పినట్టు ఒకరు చెప్పలేదు. కొందరు "మీకేం ఫర్వా లేదు. గట్టివాళ్ళను పెట్టుకోండి. డబ్బుకు చూడకండి" అన్నారు. మరికొందరు బద్ధకస్తులు "ఎందుకొచ్చింది? రాజీ పడండి" అన్నారు. ఒక త్రాష్టుడుమాత్రం మీరు "చిత్తుగా ఓడిపోతారు. యిటువంటి కేసులోనే వెనక బొంబాయి హైకోర్టు తీర్పొకటి మీకు విరుద్ధంగా వుంది. నేనే మీ స్థానంలో వుంటే ఆస్తి వదిలేసు కుంటాను!" అనేశాడు. ఎవరిమాట నమ్మాలో చలమయ్యకి తెలియలేదు పైగా కాసితో పొయ్యేదానికి కాంతం రూపాయి ఖర్చుపెట్టిస్తాడు. టాక్సీక్రిందా, హోటళ్ళక్రిందా, ప్లీడర్ల ఫీజు క్రిందా అయిదారు వందలు చెల్లిందిగాని పర్యవ సానం లేదు. పైపెచ్చు కాంతం "అప్పుడే ఏమయింది? ఆవగింజలో అర్థభాగం కాలేదు" అన్నాడు.

ఆ బొంబాయి హైకోర్టుతీర్పు యిక్కడ వర్తిస్తుందో లేదోనని విచారించ డానికి మళ్ళీ అందరి చుట్టూ తిరిగారు. కొందరు "అబ్బే, యిది వేరు అది వేరు" అన్నారు. మరికొందరు, 'చెప్పలేం! జాగర్తగా చూడాలి" అన్నారు ఒకరిద్దరు, "జాగర్త పడవలసిన విషయమే" అన్నారు.

చివరికి వ్యాజ్యంలోకి దిగటమే ఖాయమయింది. రాజీపడాలనే కోరిక అవ తలివాళ్ళ కుండాలని ప్లీడర్లు నమ్మకంగా చెప్పారు.

"చూశావా బావా! నువ్వు డబ్బయిపోతుందో అంటావుగాని లోతుపాతులు తెలుసుకోవు. టాక్సీల్లో తిరక్కపోతే రోజుకు ఒక ప్లీడరికన్న చూడలేం. వాడు మనకేసి చూడడు. అంతా ధైర్యం చెబుతున్నారు కనక దిగిచూడు. నా సహ కారం నీ కెప్పుడూ ఉండనే ఉంది!" అన్నాడు కాంతం

ఈ వ్యాజ్యంతో మళ్ళీ కాంతం చలమయ్యగారికి దగ్గరవాడైనాడు. వాళ్లిద్దరూ పట్నంనుంచి తిరిగి వచ్చేనరికి యశోదలో చాలా మార్పు జరిగినట్టు కనబడింది. ఆమె దక్షిణామూర్తి మాటలకు ఇప్పుడు నవ్వుతున్నది. వాళ్ళిద్దరూ కాపరంచేసే భార్యాభర్తల్లాగా ఉన్నారు.

కాంతానికి అంతా అర్థమయింది. దక్షిణామూర్తి సరిగా తను అనుమా నించినట్టే చేస్తున్నాడు. వాడు హోటల్లో పనిమానేసి నెలరోజులయింది. మళ్ళీ పనికోసం ప్రయత్నించినట్లులేదు. తండ్రి వూళ్లో లేనిరోజుల్లో యశోద "అబ్బాయి"కి కొత్తబట్టలు కొనిపెట్టింది. సిల్కు చొక్కాలు కుట్టించింది. ఈ దక్షిణామూర్తి వెధవ తనని తోసిరాజని పీఠం ఎక్కికూచున్నాడు. వీణ్ని

దించాలి. తను కష్టపడి కేసు గెలిపిస్తే ఈ వెధవ అనుభవించనా? ఒక్కనాటికీ వీలుపడదు. తన బొందెలో ప్రాణం వుండగా ఆ పని జరగటానికి వీల్లేదు. వీడి భరతం పట్టించాలి.

కాని ఎట్లా?

సూటిగా నిజం చెప్పేస్తే? నిజంకన్న పదునైన అస్త్రం లేదు. ముందు వ్యాజ్యం పెట్టుకుని చలమయ్య తనని వదులుకోలేడు. కానీ ఇంకో అడ్డం ఉంది. నిజం తెలిసిపోతే యశోద ఇక ఎన్నటికీ తనని క్షమించదు. తనకు అపకారం జరక్కుండా దక్షిణామూర్తిగాణ్ణి దాటించేస్తే యశోద యావజ్జీవమూ తనకు కృతజ్ఞురాలై ఉంటుంది. తనకేసు గెలిపించడూ మరి?

దీని కేమిటి ఉపాయం?

తనవంటి రసిక చక్రవర్తికి లొంగనిదాన్ని వీడు ఇట్టే బుట్టలో వేశాడే! ఏముంది? నేనే నారాయణశాస్త్రి నని ప్రమాణాలు చేసివుంటాడు. పిచ్చికట్టె నమ్మింది! ఏ లెక్క ప్రకారం చూసినా యశోద తనది! అటువంటి యశోదను కుక్కముట్టుకున్నట్టు ఈ వెధవ ముట్టుకోనా? తను ఊళ్లో ఉంటే ఇంతపని జరక్కపోను.

ఏమిటి ఉపాయం!

ఆకాశరామన్న ఉత్తరం రాస్తే? యశోద చించి అవతల పారేస్తుంది. ఉత్తరం చాలదు. మనిషి వత్తిడి కావాలి. పోలీసులదగ్గర చార్జి పెడితే వీడు మరొకడని? ఋజువుచేసుకోవలసి వస్తుంది.

వెధవ, కోటలో కూర్చున్నట్లు ఎంత బలంగా కూచున్నాడో! అందుకే వాడికా ధైర్యం. వాడిక్కూడా నిజంగా బుర్ర ఉంది.

ఒక బుర్రగలవాడు మరొక బుర్రగలవాణ్ని గుర్తించడంలో స్వారస్యం ఉంది. కాంతం అటువంటి స్వారస్యం ప్రకటించాడు. కాని తన ప్రయత్నం మాత్రం మానలేదు.

రెండు రోజులు గడిచినై. ఒక రాత్రివేళ కాంతానికొక ఆలోచన- ఒక గొప్ప, అద్భుతమైన, అత్యద్భుతమైన, బ్రహ్మాండమైన, తల పగిలిపొయ్యే ఆలోచన—తట్టింది. రాత్రల్లా నిద్రపట్టలేదు. ఇంత గొప్ప ఆలోచన తనకు కాగా తట్టిందనుకున్నాడు. దీన్ని ఎప్పుడాచరణలో పెడదామా, ఎప్పుడు తెల్లారుతుందా, ఎప్పుడు నారిగాణ్ని చూస్తానా అని నిద్రలేకుండా రాత్రల్లా తహతహలాడాడు.

నారిగా దెందుకంటే, వాడు లేకుండా ఈ ఆలోచన ఆచరణలో పెట్టడం కష్టం!

## 11

మర్నాడు తెల్లవారింది. అయితే అందరికీ ఒక విధంగా తెల్లవారలేదు కాంతానికి భళ్ళున తెల్లవారింది. యశోదకీ దక్షిణామూర్తికీ చాలా అందంగా తెల్లవారింది. ఒక రాత్రివేళ ఆమె అతని గదికి వెళ్ళింది. తెల్లవారుజామున ఇద్దరూ కిటికీదగ్గర నిలబడ్డారు.

"రోజూ ఇట్లా ఆరంభం కావాలి!" అన్నాడు దక్షిణామూర్తి ఆమెను ముద్దు పెట్టుకుని.

"ఇక నేను పోవాలి!" అన్నది యశోద.

"అవును పోవాలి!" అన్నాడతను, ఆమెను చుట్టిన చేతులు తియ్యకుండానే.

"మంచి అబ్బాయిలు అల్లరి చేయరు."

"మంచి అబ్బాయిలు చేసే పనులు అల్లరి కావు!"

"పోతానమ్మా!"

"అట్లా మంచిగా అడిగితే పోవచ్చునమ్మా!"

ఆ పూట దక్షిణామూర్తి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానంచేసి బట్టలు వేసుకుంటుండే సమయానికి ఎనిమిది గంటలయింది. ఆ సమయానికి యశోద కాఫీ తెచ్చి అతని బల్లమీద పెట్టి "మీకోసం ఎవరో వచ్చారు. చెప్పుకోండి!" అన్నది.

కొట్టినట్టుగా వెనక్కు తిరిగి దక్షిణామూర్తి "నా కోసం ఎవరొస్తారు?" అన్నాడు.


"పాపం, ఆవిణ్ణి చూడటానికి మీరు వెళ్ళక, అంత ముసలిదాన్ని మీకోసం రప్పిస్తారా?" అన్నది యశోద.

"ఎవరా ముసలిది? ఏమిటి నవ్వంటున్నది!" అన్నాడు దక్షిణామూర్తి కంగారుగా.

"కనుక్కోలేదు; పాపం, చెప్పేస్తాను—మీ నాయనమ్మ!"

దక్షిణామూర్తి గదిలోంచి పరుగెత్తాడన్నమాట. అవ్వా మనవలు కలుసుకుని ఏం చేసుకుంటారో చూద్దామని యశోదకూడా అతనివెంట పరుగెత్తింది.

ఎనభై ఏళ్ళ వృద్ధు మంచంమీద వంగి కూచుని ఉంది. ఆవిడకి దక్షిణామూర్తి అలికిడి వినపడ్డట్టే లేదు. ఆమెవెంట వచ్చిన కుర్రవాడు కాబోలు అంత దూరాన చూరుకేసి చూస్తూ నిలబడ్డాడు



ఆమెను చూడగానే దక్షిణామూర్తి కొయ్యబారినట్టు ఆగాడు — ఒక్క క్షణం పాటు, ఆ క్షణంలోనూ యశోద అనుమానాలన్నీ తిరిగి వచ్చినై. ఆవిడనుచూసి తన మొగడెందుకట్లా బిగుసుకుపోవాలి? ఇదేనా అతనికి నిజమైన పరీక్ష?

దక్షిణామూర్తి రెండంగల్లో ముసిలిదాని దగ్గరికి వెళ్ళి ఆమె ప్రక్కనే కూచుని రెండు చేతులూ పొదివి పట్టుకుని "ఏం నాయనమ్మా? నాకోసం వచ్చావా?" అన్నాడు.

"అందులో ఏముందీ? మీ నాయనమ్మ అని నేను ఎందుకు చెప్పాను నా తెలివి తెల్లారా?'' అనుకున్నది యశోద.

"ఎన్నాళ్ళయిందిరా బాబూ! లేచిపోయినావటగా! ఏదీ మొహం చూడనీ!" అంటూ ముసిలిది దక్షిణామూర్తి మొహం, భుజాలు తడివింది. "మాట వినపడదు కదా! కళ్ళు కనపడవుగదా!"

"మరెందుకొచ్చేవు? నేనే వచ్చేవాణ్నిగా!" అని అరిచాడు దక్షిణామూర్తి.

"నువ్వా? నీకు నా గొడవే పట్టింది!"

"అదేమిటి నాయనమ్మా! ఇక బ్రతికినన్నాళ్ళూ నా దగ్గిరే ఉండు!"

"నీ మొహం, నీ తండ్రి నా మొహాన మొద్దులు పెట్టాడా? నువ్వు చేస్తావు! ఏమిటో? నీకు మీ తాత పేరు పెట్టుకోమంటే విన్నాడూ? వాడి జన్మ చెడా!"

"ఆయన పెట్టకపోతే నే పెట్టుకోనూ నాయనమ్మా?"

"ఏదో, ఏ పేరయితే ఏం? నాలుక్కాలాలపాటు బాగుండు నాయనా. నీ కడుపు చల్లగా! నీ తల్లికడుపు చల్లగా!"

ముసలావిడ ఈ మాటలంటూ ఉండగా వీధి నాటకంలో బాణాసురుడు వచ్చినట్లు కాంతం, ఎవరో ఒక పెద్దమనిషిని వెంటబెట్టుకుని దూకుడుగా వచ్చి యశోదను చూస్తూనే "నాన్న ఏడే?" అన్నాడు. ఆ రెండో వ్యక్తి అకస్మాత్తుగా దక్షిణామూర్తిని చూసి మొహం చాటంత చేసుకుని "ఏంరోయ్ దక్షిణామూర్తీ! ఇక్కడున్నావేం? నిన్ను నేను క్రిందటిసారి చూసినప్పుడు నువ్వు పూనాలో ఏదో ఆఫీసు చిమ్ముతున్నావే!" అన్నాడు.

దక్షిణామూర్తి లేచి నిలబడ్డాడు. అతని మొహం పాలిపోయింది. పెదిమలు వణుకుతున్నాయి. అతను ఒక్కసారి యశోదకేసి, మళ్ళీ తనను పలకరించిన మనిషికేసి చూశాడు.

"ఏమిటి, నన్ను గుర్తించలా?" అన్నాడా మనిషి.

"ఏమిట్రా? వీడిపేరు నారాయణశాస్త్రి కాదూ? ఇంకో పేరుతో పిలుస్తావేం?" అన్నాడు కాంతం తనతో వచ్చినవాడితో.


"వీడా? వీడిపేరు నారాయణశాస్త్రి?" పెద్ద నవ్వు. "వీడు దక్షిణామూర్తిరా!"

"ఛా!"

"వీడు ఆ పూనాలో పాకీపని చేసుకునేవాడు!"

"ఓరి భ్రష్టుడా? ఎంతపని చేశాడూ? మా బావకి భలే టోపీ వేశాడే! నిష్కారణంగా మా మేనగోడల్ని గోతిలో తోశాడే! కొంపలంటుకున్నాయి! ఇదేం ప్రారబ్ధంరా భగవంతుడా?" అని కాంతం వాపోవసాగాడు.

ఈ సంభాషణంతా వింటున్న యశోదకి దడ పుట్టుకొచ్చింది. ముచ్చెమటలు పోసినై. తల తిరిగింది. మోకాళ్లు నీరసించాయి. ఆమె కాంతంకేసి, తన మొగుడికేసి వెర్రిదానల్లే చూడసాగింది. ఈ సంభాషణంతా ఒకెత్తూ, దక్షిణామూర్తి మౌనం ఒకెత్తు అయింది ఆమె ప్రాణానికి. అతను ఒక్క మాటైనా మాట్లాడడేం? వీళ్ళనే మాటలన్నీ అబద్ధాలనడేం? అట్లా చూస్తూ నిలబడతాడేం?




అతనట్లా రాతిబొమ్మల్లే నిలుచునేకన్న వాళ్ళు చెప్పేది నిజమన్నా తనకు ఊపిరి సలిపేటట్టు కనబడ్డది.

ఈ సమయానికి సరిగా చలమయ్యగారు వచ్చాడు. ఆయన వస్తూనే ఏదో జరిగిందని పసికట్టాడు.

"ఏమిట్రా కాంతం? ఏమిటి?" అన్నాడు ఆదుర్దాతో.

"ఇంకా ఏమిటంటా వేమిటి? వీడు నారాయణశాస్త్రి కాడుట. వీడి అసలు పేరు...అదేమిటి? దక్షిణామూర్తిట. మనవాడు పూనాలో చూశాట్ట. బాగా ఎరుగునట! నీ కొంప నిలువునా కూలింది. నీ కూతురి బ్రతుకు గంగలో కలిసింది. ఏం చేస్తావో చెయ్యి! ఎవరి ఖర్మకు ఎవరు కర్తలు!" అన్నాడు కాంతం.

చలమయ్య మట్టుకు తొణకలేదు. అందుకు ఆయన్ని నిజంగా మెచ్చుకోవలసిందే. ఆయన దక్షిణామూర్తి కేసి తిరిగి, "ఏమిటి ఇదంతా, నువ్వు మా అల్లుడివి కావా?" అన్నాడు.

"ఇప్పుడిక అల్లుడే!" అన్నాడు కాంతం హాస్యమనుకుని.

"ఛత్, నువ్వూరుకో! ఏమిటోయి! పలకవేం? నిన్నే!" అన్నాడు చలమయ్య.

ఈ సారి దక్షిణామూర్తి నోరు విప్పాడు. అతను మాట్లాడుతుంటే అతనికెవ్వరూ అడ్డం రాలేదు. కాంతం అడ్డం పోదామనుకున్నాడుగాని సాధ్యం కాలేదు.

"నా పేరు నారాయణశాస్త్రి అని నేనెన్నడూ అనలేదు. ప్రాణం దక్కించుకునేటందుకైనా నే నా పేరు చెప్పుకోను. ఈ మనిషి చెప్పినట్టు నేను ఆఫీసులు

ఊడ్చినమాట నిజమేగాని, ఈయన ఈ క్షణంవరకూ నన్నెన్నడూ చూడ లేదు. ఆయన నా పేరు కనుక్కున్నట్టే ఈయన పేరు నేను కూడా చెప్ప గలను—నారిగాడు."

దక్షిణామూర్తి ఈ మాట అనగానే కాంతంవెంట వచ్చిన స్నేహితుడి మొహం కందగడ్డ అయింది.

ఈ సంగతి నా కెట్లా తెలుసునంటే, పూనాలో ఒక రోజు రాత్రి నారిగాడనే ఒక పగటి బాగోతుణ్ణి గురించి ఈ కాంతంగారు నాకు చాలాసార్లు చెప్పారు. ఈయన ఎంత నటనైనా చెయ్యగలడట. ఎంతమందికో టోపీవేశాడుట. ఈయన ఇక్కడ చేసిన నటననుబట్టి ఈయన నారిగాడేనని గ్రహించాను. ఈయన మొహం జేవురించటం చూస్తే నేను పొరపాటు పడలేదని తెలిసింది."

"ఇక నే నిక్కడికి రావటం విషయం నా అంతట నేను రాలేదు. పూనా నించి ఇక్కడికి టిక్కెట్టు కొనుక్కోవటానికి నాకు డబ్బెట్లావస్తుంది ఆఫీసులు తుడిచేవాడికి? నామీద కాంతంగారు పెట్టుబడి పెట్టారు. నే నేంచెయ్యాలో ఒక రోజల్లా బోధపరిచాడు వివరాలన్నీ బాగానే చెప్పాడు. ఈ ముసలిదాని మాట మాత్రం చెప్పటం మరిచాడు. బహుశా ఆయన కీవిడ్ణి గురించి తెలిసి ఉండదు.

నేను అచ్చంగా కాంతంగారు చెప్పినట్టే చెయ్యలేదు. కాళిదాసుగారి కవిత్వా నికి నా పైత్యం చాలా జతచేశాను లేకపోతే నేను మీతోనూ, మీ అమ్మాయి తోనూ సాధ్యమైనంత త్వరలో స్నేహ బాంధవ్యాలు ఏర్పాటుచేసుకుని ఈవిడ కున్న ఆ సంతానా పేర రాయించుకుని అందులో సహంభాగం కాంతంగారి పేర రిజిష్టరు చెయ్యవలసింది. నేనా పని చెయ్యలేదు. మీయిద్దరితోనూ వీలయినప్పు డల్లా పోట్లాడాను యశోదను దూరాన ఉంచటానికి ప్రయత్నంచేసి ఆకర్షించా నల్లే ఉంది. కాని నేను పశ్చాత్తాప పడటంలేదు యశోదలో మానవత్వం ఉంది. అటువంటి మనిషి ఒంటరి జీవితం గడపటంచాలా అన్యాయం.''

"అందుకని నువ్వు వచ్చి మొగుడుతనం మీద వేసుకున్నావా?'' అన్నాడు చలమయ్య పళ్ళు బిగపట్టి.

చలమయ్య మాట్లాడగానే కాంతానికి ధైర్యం వచ్చింది.

"వీడు ఆరితేరిన గజదొంగ. వీడు నన్నుగురించి చెప్పినవన్నీ పచ్చి అబ ద్ధాలు! వట్టి మోసం! మోసం!!" అన్నాడు కాంతం గొంతు చించుకుని.

"ఏమిటి? పాపం, ఈ పెద్దమనిషి నారిగాడు కానేకాదా?'' అన్నాడు దక్షిణా మూర్తి అమాయకంగా.

నారిగాడు కాంతం కేసి తిరిగి "నీ మొహమల్లే ఉంది! నీ వెధవ ఆలోచనలూ, నువ్వూనూ!" అంటూ బయటికి వెళ్ళాడు.

ఈ సారి చలమయ్యగారు మాటాడేటప్పుడు గొంతు కొంచెం వణికింది.

"నా బావమరిది బ్రతుకు నే నెరుగుదును. నువ్వు చెప్పినంతా వాడు చెయ్యగలవాడే! కాని నువ్వుకూడా ఎందుకింత పని చేశావు? నువ్వు చూడబోతే దబ్బు కాశపడ్డవానివల్లే లేవు. నీలో పెద్దమనిషి లక్షణాలు కొన్ని వున్నట్టు కనిపిస్తుంది. నీకు నేనూ నా కూతురూ ఏం ద్రోహం చేశాం? మమ్మల్నెందుకిట్లా అపఖ్యాతిపాలూ, నవ్వులపాలూ చేశావ్?

''ఇదేంపని నాయనా!" అన్నాడు చలమయ్యగారు కళనీళ్ళ పర్యంతమై.

"అపఖ్యాతీ! నవ్వులూనూ!" అని గొణుక్కుంటూ దక్షిణామూర్తి వంగి ముసలమ్మ చెవిలో గట్టిగా, ''నాయనమ్మా, నీ మొగుడు పేరేమిటో చెప్పవూ," అన్నాడు.

ముసలావిడికి అంతా ఆయోమయంగా ఉంది. ఎవరెవరో వచ్చి ఏమేమిటో మాటాడారు. ఆవిడకు ఒక్కరూ సరిగా కనిపించలేదు. ఒక్కటీ వినిపించలేదు. దక్షిణామూర్తి అడిగిన ఈ ప్రశ్నకు ముసలావిడ చప్పుడు కాకుండా నవ్వి, "మొగుడి పేరు చెబుతారట్రా?" అన్నది.

"ముసలిదానికూ్కడా సిగ్గేనా? చెప్పదూ!" అన్నాడు దక్షిణామూర్తి.

"బ్రతికున్నకాలంలో ఆయనపేరు దక్షిణామూర్తి శాస్తుల్లు" అన్నది ముసలమ్మ.

దక్షిణామూర్తి నడుముపట్టుకుపోయినవాడల్లే మెల్లిగా లేచి మళ్ళీ నిటారుగా నిలబడ్డాడు.

"మా నాన్నా నాకు మా తాతపేరు పెట్టలేదు. ఆయన చావగానే నేనా పేరు పెట్టుకున్నాను. మా నాన్నను మీ రెరగరు. ఆయన కడుపున పుట్టటం కంటే మహాపాతకం నేను చెయ్యలేదు. ఆఫీసులు తుడవటం మంచివాళ్ళూ, సత్పురుషులూ చేసే పని! మా నాన్న చావగానే నేను స్వేచ్ఛకోసం లేచిపోయినాను. ఆయన చేసిన పెళ్ళికూడా నాకు విషమే అయింది. కాని దైవవశాత్తూ నా భార్య నాకు మళ్ళా దొరికింది!"

"నేను నమ్మను. ఇదంతా ఏదో ఎత్తు. అసలీ ముసలి దెవరు! వీడు నాకు హోటల్లో దొరికిన ఒక అనామకుడు. వీడే మనకు కావలసిన మనిషికావటం

అసంభవం. కప్పే రాజు కొడుకు కావటానికి ఇదేమన్నా కథా?" అన్నాడు కాంతం తన రంకు కాస్తా బయటపెట్టేసుకుని.

"ఒక్క క్షణంక్రితం మనం పూనాలో కలుసుకున్న మాట అబద్ధమై ఇంతలో ఎట్లా నిజమయింది? నీకు నేను దొరికాననుకుంటున్నావు. జరిగింది అదికాదు, నాకే నువ్వు దొరికావు. నాలుగు రోజులు వరసగా నిన్ను చూసి ఎక్కడ చూశానా ఈ మొహం అనుకున్నాను. అయిదోరోజు నా పెళ్ళిలో చూశానని జ్ఞాపకం వచ్చింది. నేనే అప్పుడు నిన్ను పలకరించాను. నన్నిక్కడికి తెచ్చిన కీర్తి నీకే దక్కుతుందిలే, నేను కాదనను. నువ్వుకూడా నా మొహం తెలియ కుండానే పోల్చుకుని వుంటావు. నన్ను తెచ్చి యశోద మొగుడని నాటకం ఆడా లని ఊరికే స్ఫురించలేదు. ఇంకొక మొహంచూస్తే నీ కా ఆలోచనే తట్టి ఉండదు. మొదటిసారి నీ ఆలోచన విన్నప్పుడు నిర్ఘాంతపోయినాను. అప్పుడన్నా నన్ను పోల్చుకుంటావనుకున్నాను. నువ్వు పోల్చుకోలేదు. ఆ తర్వాత నిన్ను సులభం గానే మోసంచేశాను. ఆ హోటల్లో నువ్వు నన్ను బెదిరించినపుడు నాకు నవ్వొ చ్చింది! నీ జుట్టు నా చేతిలో వుందని నీ కేమాత్రమూ తెలీదు. నా ధైర్యం చూసి నువ్వు నేను చాలా సాహసిననుకుంటావనుకున్నాను. ఔనా?"

"నీ సాహసం మండినట్టే ఉంది!" అంటూ కాంతం వెళ్ళిపోయినాడు.

"ఒరే, మళ్ళీ ఈ గడప తొక్కకు! విన్నావా?" అని చలమయ్య కేక పెట్టాడు.

"బ్రతికించావు నాయనా! నాకు మొదటినుంచీ అనుమానంగానే ఉంది. మా కాంతం మాటలు వినేసరికి అనుకున్నంతా అయిందనుకున్నాను" అన్నాడు చలమయ్య.

ఇంతసేపూ దక్షిణామూర్తి యశోదకేసి చూడలేదు. ఇప్పుడామెకేసి తిరిగాడు. ఆమె మొహంలో అతనికి కావలసిన భావం గోచరించింది.

## 12

మరో గంటకు చలమయ్యగారు వంటింట్లోకి తొంగిచూశాడు. యశోద వంట ప్రయత్నంలో ఉంది.

"అన్నట్లు అమ్మాయ్, వాళ్ళు రాజీబేరానికి వస్తున్నారే. మన ప్లీడరు రాజీ పడవచ్చంటున్నారు."

''రాజీ అవుదాం నాన్నా! ఏమిటీ వెధవ వ్యాజ్యాల పీడ'' అన్నది యశోద.

"నీకూ ఆ బుద్ధే పుట్టింది!" అంటూ వెళ్ళిపోయినాడు చలమయ్య.